www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 14 మే 2024
8 పేజీలు

ఏలూరు పశ్చిమ గోదావరి

ఏలూరులో చాంతాడులా ఓటర్ల క్యూ లైన్

ఓ(పో)టెత్తిన జనం..!

- రెండు జిల్లాల్లో పోలింగ్ ప్రశాంతం
- ఉదయం నుంచే బారులు తీరిన ఓటర్లు
- మధ్యాహ్నం వరకూ మందకొడిగా పోలింగ్
- పలుచోట్ల ఇవిఎంల మొరాయింపు, చెదురుమదురు ఘర్షణలు
- ఓటేసేందుకు వచ్చి గుండెపోటుతో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునేందుకు రెండు జిల్లాలోనూ ఓటర్లు పోటెత్తారు. 2024 సాధారణ ఎన్నికల ప్రక్రియ ఉదయం ఏడు గంటలకు ప్రారంభం కావడంతో జనం ఉదయం నుంచే పోలింగ్ బూత్‌ల వద్ద బారులుతీరారు. ఎండబారిన పడకుండా ఓటేయాలని అంతా ముందుగానే పోలింగ్ బూత్‌లకు తరలొచ్చారు. అయితే ఇవిఎంల మొరాయింపు తదితర కారణాల రీత్యా మధ్యాహ్నం ఒంటిగంట వరకూ పోలింగ్ రెండు జిల్లాల్లోనూ నత్తనడకన సాగింది. మధ్యాహ్నం ఒంటి గంటకు రెండు జిల్లాల్లోనూ 42 శాతానికి మించి పోలింగ్ నమోదు కాని పరిస్థితి ఉంది. దీంతో పోలింగ్ శాతం గత ఎన్నికల కంటే భారీగా తగ్గుతుందా అనే అనుమానాలు నెలకొన్నాయి. ఓటేయడానికి వచ్చిన ప్రతిఒక్కరూ పోలింగ్ బూత్ వద్ద కనీసంగా గంట నుంచి రెండు గంటలకుపైగా నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. సోమవారం ఉష్ణోగ్రత తీవ్రస్థాయిలో ఉండటంతో ఎండకు తాళలేక జనం అల్లాడిపోయారు. చాలాచోట్ల వృద్ధులు స్పృహ తప్పిపడిపోయిన పరిస్థితి కన్పించింది. భీమవరం మండలం యనమదుర్రు, కైకలూరు మండలం వింజరంలో ఇద్దరు వృద్ధులు పోలింగ్ బూత్ వద్దే గుండెపోటుతో మృతి చెందిన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఉంగుటూరు మండలం కైకరం, ముసునూరు మండలం గోపవరం, కాళ్ల, నరసాపురం, పాలకొల్లు, భీమవరం, పాలకోడేరు మండలాల్లో అనేక పోలింగ్ బూత్‌ల్లో ఉదయం ఇవిఎంలు మొరాయించాయి. తర్వాత సరిచేయడంతో పోలింగ్ ముందుకు సాగింది. ఓటు వేసేటప్పుడు ఓటింగ్‌కు ఇవిఎంలు ఎక్కువ సమయం తీసుకోవడం కారణంగానే పోలింగ్ నత్తనడకన సాగిందనే చర్చ నడిచింది. పలు పోలింగ్‌బూత్‌ల వద్ద పోలీస్ బందోబస్తు సరిగా లేకపోవడంతో తోపులాటలు చోటుచేసుకున్నాయి. పోలింగ్ బూత్‌లో జనం ఉదయం నుంచి కిటకిటాలడుతూనే ఉన్నారు. బెంగుళూరు, హైదరాబాద్, చెన్నయ్ వంటిచోట్ల ఉద్యోగాలు చేస్తున్నవారు, ఉపాధి కోసం వెళ్లిన వారు సైతం సొంత ప్రాంతాలకు తరలొచ్చి ఓటుహక్కు వినియోగించుకున్నారు. అలావచ్చిన వారికి రాజకీయ పార్టీలు దారి ఖర్చులు, ఓటుకు నోటు సైతం ఇచ్చిన పరిస్థితి ఉంది. ఉంగుటూరు నియోజకవర్గం భీమడోలు మండలంలో ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు తమ్ముడు ..6లో

ఓటు హక్కు వినియోగించుకున్న ఏలూరు, పశ్చిమ కలెక్టర్ దంపతులు

ఏలూరులో రిసెప్షన్ సెంటర్‌కు చేరుకున్న ఇవిఎంలు

పోలింగ్ ప్రశాంతం

ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ ప్రశాంత వాతావరణంలో సాగిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. సోమవారం ఉదయం 5.30 గంటలకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో మాక్‌పోల్ నిర్వహించారని, ఒకటి రెండుచోట్ల ఇవిఎం సాంకేతిక ఇబ్బంది వచ్చి వెంటనే వాటిని సరిచేసినట్లు చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగార్థం సెక్టార్ అధికారి వద్ద ఒక ఇవిఎంను ఉంచామన్నారు. పోలవరం నియోజకవర్గంలో 13 పోలింగ్ కేంద్రాలకు ఫోన్ సౌకర్యం లేని కారణంగా విహెచ్‌ఎఫ్ సెట్లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఏలూరు నగరంలో పోస్టల్ కాలనీ కెనాల్ రోడ్‌లోని మత్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 115వ పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఆయన వెంట నగరపాలక కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ ఉన్నారు.

కంట్రోల్ రూమ్ నుంచి నిరంతర పర్యవేక్షణ

భీమవరం రూరల్: ఎన్నికల్లో పోలింగ్ బూత్‌ల వద్ద పరిస్థితిని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, జిల్లా ఎస్పి అజిత వేజెండ్ల కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రాల వెబ్ కాస్టింగ్ , సోషల్ మీడియా మానిటరింగ్, రూట్ మొబైల్స్ వాహనాల జిపిఎస్ ట్రాకింగ్ సిస్టమ్‌ను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

పోటెత్తారు..

మధ్యపేజీల్లో..

పోలింగ్‌ను బహిష్కరించిన గిరిజనులు

8లో..

ఓటుకు నోటు ఇవ్వలేదని నిరసన

8లో..

'పశ్చిమ'లో నత్తనడకన పోలింగ్

- ఓటేసేందుకు రెండు గంటలకుపైగా నిరీక్షణతో వెనుదిరిగిన ఓటర్లు
- పలుచోట్ల మొరాయించిన ఇవిఎంలు
- పోలింగ్ కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు లేక అవస్థలు
- వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులూ ఎండలోనే పడిగాపులు
- ఇరుకు గదుల్లో ఇబ్బందులు పడ్డ మహిళా ఓటర్లు
- కేంద్రాల వద్దే ప్రలోభాలనూ పట్టించుకోని అధికారులు



భీమవరంలో మండుటెండలో ఓటర్ల పడిగాపులు

ప్రజాశక్తి - భీమవరం

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ నత్తనడకన సాగడం, పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు కొరవడటంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఓటు హక్కు వినియోగానికి ఓటర్లు ఉదయం పోలింగ్ కేంద్రాలకు తరలొచ్చినప్పటికీ పోలింగ్ ప్రక్రియ నిర్ణయించిన సమయానికి ప్రారంభం కాలేదు. అనేకచోట్ల ఇవిఎంలు మొరాయించడంతో ఈ దుస్థితి ఏర్పడింది. అయితే ఉదయమే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఉదయం ఏడు గంటల సమయానికి దాదాపు అన్ని పోలింగ్ కేంద్రాలు ఓటర్లతో కిటకిటలాడాయి. అయితే ఓటేసేందుకు ..6లో

పోలింగ్ సరళి ఇలా..

ఏలూరు జిల్లాలో..

గంటలు	పోలింగ్‌శాతం
9 గంటలకు	10.14
11 గంటలకు	25.48
ఒంటి గంటకు	42.64
3 గంటలకు	57.11
5 గంటలకు	72.03
6 గంటలకు	75.05

పశ్చిమగోదావరి జిల్లాలో..

గంటలు	పోలింగ్‌శాతం
9 గంటలకు	9.61
11 గంటలకు	23.26
ఒంటి గంటకు	39.06
3 గంటలకు	53.67
5 గంటలకు	68.36

నోట్; ఇంకా తుది పోలింగ్‌శాతం రాత్రి 11 గంటల వరకూ అందలేదు)

ప్రశాంతంగా పోలింగ్

పాలకొల్లు:పాలకొల్లు నియోజకవర్గంలో ప్రశాంతంగా పోలింగ్ ప్రారంభమైంది. ఉదయం 7 గంటలకే పట్టణంలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు భారీ క్యూలలో నిల్చొని తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు 55 శాతం పోలింగ్ నమోదైంది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి ప్రజలు కూడా ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొనడంతో అసలు ఏ పార్టీ అధికారం చేపడుతుందో ఇరు పార్టీలు విశ్లేషించుకుంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో సైతం మహిళలు, వృద్ధులు ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొన్నారు. అయితే పలుచోట్ల ఓటు వేయడానికి ఎక్కువ సమయం పట్టడంతో క్యూలైన్‌లో నిల్చున్నవారు ఇక్కట్లు పడుతున్నారు. పట్టణంలోని డిఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో 1400 మంది ఓటర్లు ఉండగా మధ్యాహ్నం ఒంటిగంటకు కేవలం 350 మంది మాత్రమే ఓటు వేశారు. అయితే ఇంకా బయట పెద్ద క్యూలైన్ ఉండటంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. కేవలం ఒక్కొక్క పోలీస్ మాత్రమే ఉన్నా ఎక్కడా ఘర్షణ వాతావరణం లేదు. ఓటర్‌లే రారాజులుగా తమకు నచ్చిన వారికి ఓటు వేసుకుంటున్నారు. ఉదయం 9 గంటలకు 11 శాతం, 11 గంటలకు 24 శాతం, ఒంటిగంటకు 40 శాతం, 3 గంటలకు 50 శాతం ఓటింగ్, 5 గంటలకు 72.10 శాతం నమోదైంది. మండుటెండను సైతం లెక్కచేయకుండా మహిళలు, వృద్ధులు, యువత ఓటింగ్‌లో పాల్గొంటున్నారు. ఎంఎంకెఎన్ఎం మున్సిపల్ హైస్కూల్‌లో తగిన టెంట్లు లేకపోవడంతో ఓటర్లు ఎండలోనే నిల్చొని అసహనం వ్యక్తం చేశారు. సాయంత్రం 5 గంటలైనా పలు బూత్‌లలో క్యూలు కొనసాగుతున్నాయి.

యలమంచిలి: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం యలమంచిలి మండలం వ్యాప్తంగా ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైనప్పటికీ ఓటర్లు మాత్రం రోజూ మాదిరి నమోదవుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకొని ఉదయం ఆరు గంటల నుండే ఎక్కడికక్కడ పోలింగ్ స్టేషన్ల వద్ద క్యూ లైన్‌లో బారులు తీరారు. అయితే పోలింగ్ చాలా మందకొడిగా సాగడంతో గంటల తరబడి నిల్చున్న చాలామంది ఓటర్లు అసహనంతో క్యూలో నిల్చోలేక వెనుతిరిగి, సాయంత్రం నాలుగు దాటిన తర్వాత కూడా క్యూ లైన్‌లో నుంచోవడం వల్ల చాలా పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం 8:30కు కూడా పోలింగ్ కొనసాగింది. ఒకపక్క ఉష్ణోగ్రత తీవ్రత, ఉక్క పోతతో సతమతమైన ఓటర్లకు అధికారులు కనీస సౌకర్యం కల్పించకపోవడంతో చాలా ఇబ్బందులు పడిన పరిస్థితి నెలకొంది.

ఆలస్యంగా ఓటింగ్ ప్రక్రియ

ప్రజాశక్తి - నరసాపురం

నియోజకవర్గంలో 169 బూత్‌లలో ఓటింగ్ జరిగింది. పట్టణం పోలింగ్ బూత్ 42లో ఇవిఎం మిషన్లు మొరాయించడంతో గంటన్నరపైగా ఆలస్యమైందని ఓటర్లు తెలిపారు. దీంతో చాలామంది ఓటర్లు వెనుతిరిగారు. 26 పోలింగ్ బూత్‌ల్లో కనీస సౌకర్యాలు కల్పించలేదని ఓటరు శ్రీరంగకృష్ణారావు ఆరోపించారు. విద్యుత్ సౌకర్యం సరిగ్గా లేదని, స్లిప్‌లో చిరునామా తప్పుగా పడిందని, వీల్‌ఛైర్లు లేవని అన్నారు. పట్టణంలోని బిజెపిఎస్ ఉమెన్స్ మహిళా కళాశాల పోలింగ్ బూత్ 47లో గంటకుపైగా ఆలస్యంగా జరిగాయి. పట్టణంలోని పీచు వదం మున్సిపల్ హైస్కూల్‌లో ఉదయం 7 గంటల నుంచి ఉన్న ఓటర్లు సుమారు నాలుగు గంటల తర్వాత 11 గంటలకి బయటికి వచ్చారని, మిషన్లు సరిగా పనిచేయకపోవడం, అధికారుల పనితీరు సరిగా లేకపోవడంతో ఆలస్యం అవుతుందని ఆరోపించారు. మధ్యాహ్నం సమయంలో పోలింగ్ బూత్‌లు ఖాళీగా కనిపించాయి. పట్టణంలోని మిషన్ హైస్కూల్, ఎస్ఎంఎస్ హై స్కూల్, బిజి బిఎస్ మహిళా కళాశాల బూత్లను జిల్లా ఎన్నికల పరిశీలకులు ఎం.దీప పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద మొబైల్ తీసుకురాకూడదని నిబంధన పెట్టడంతో చాలామంది ఓటర్లు ఇబ్బంది పడ్డారు. తీసుకొచ్చిన ఫోన్లను బయట వారికి ఇచ్చి ఎన్నికల కేంద్రాలకు వెళ్లారు. తెల్లవారుజాము 7 గంటలకి ఓటర్లందరూ క్యూలైన్‌లో నుంచునప్పటికీ మిషన్ స్లోగా ఉండడంతో ఓటింగ్ శాతం తగ్గాయి. చాలామంది ఎండ వేడిమికి తట్టుకోలేకపోయారు.

ఓటింగ్‌శాతం: నియోజకవర్గంలో ఓటింగ్ శాతం వివరాలు ఎలా ఉన్నాయి. ఉదయం నుంచి ఓటర్లు ఓటు వేసేందుకు క్యూలైన్‌లో వేచిచూశారు. నియోజకవర్గంలో 1,70,448 ఓటర్లలో 169 మంది బూత్‌ల్లో ఓటింగ్ వేశారు. ఉదయం 9 గంటలకు 14,863 ఓట్లు వేయగా 8.72 శాతం నమోదైంది. ఉదయం 11 గంటలకు 39,237 మంది ఓట్లు వేయగా 23.02 ఓటింగ్ శాతం నమోదైందని, మధ్యాహ్నం 1 గంటకు 66,389 ఓట్లు వేయగా 38.95 శాతం ఓటింగ్ నమోదైందని రిటర్నింగ్ అధికారి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు 92,502 మంది ఓట్లు వేయగా 54.27 శాతం నమోదైందని రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ ఎం.అచ్యుత్ అంబరీష్ తెలిపారు.

మొగల్తూరు : మండలంలోని 17 పంచాయతీల్లో సోమవారం స్థానిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం నుంచి ఓటర్లు 59 పోలింగ్ కేంద్రాల్లో ఓటుహక్కుని సద్వినియోగం చేసుకునేందుకు బారులు తీరారు. మొగల్తూరు, పేరుపాలెం, కాళీపట్నం, శేరేపాలెం తదితర గ్రామాల్లో ఇవిఎంలు కొంత సమయం మొరాయించాయి. ఆయా పోలింగ్ కేంద్రాలను ఎంఎల్ఎ అభ్యర్థులు సందర్శించారు. మొగల్తూరులోని నెంబర్-2 పాఠశాల ఏర్పాటు పోలింగ్ కేంద్రంలో కీర్తిశేషులు, కేంద్ర మాజీ మంత్రి యువి.కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పండుగను తలపించిన ఎన్నికల వాతావరణం

నరసాపురం: సార్వత్రిక ఎన్నికలకు సంక్రాంతి పండక్కు వచ్చే సందడి వాతావరణం నెలకొంది. ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులకు, ప్రయివేట్ షాపులకు కూడా సెలవులు ఇచ్చారు. సోమవారం పట్టణంలోని మెడికల్ షాపులు, టిఫిన్ హోటల్, భోజనం హోటల్ మినహా అన్ని షాపులకు సెలవులు ప్రకటించారు. నిత్యం వ్యాపారాలతో కళకళలాడే బంగారు దుకాణాలు సైతం మూసివేశారు.

వృద్ధులకు, వికలాంగులకు అండగా.. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

నరసాపురం: పోలింగ్ కేంద్రాల వద్ద వృద్ధులకు, వికలాంగులకు అండగా.. కుటుంబ సభ్యులకి తోడుగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు నిలుస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ బూత్‌ల్లో పోలీసులకు తోడుగా ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి వాలంటీర్లు నిలుస్తున్నారు. క్యూలైన్‌లో ఓటర్లను పెట్టడం, గేట్ వద్ద బైక్‌లు పెట్టకుండా చూడటం చూస్తున్నారు. చాలా పోలింగ్ కేంద్రాల్లో వీల్‌ఛైర్లు లేకపోవడంతో చాలా మంది వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులు పడ్డారు. వారి బంధువులు వారిని పోలింగ్ కేంద్రాలకి తీసుకుని వెళ్తున్నారు. బయట ఎండ దంచికొడుతున్నా.. వృద్ధులు, వికలాంగులు మాత్రం ఓటింగ్ తగ్గలేదు.

సార్వత్రిక ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిసాయి. మండలంలోని 17 పంచాయతీల్లోని 59 పోలింగ్ కేంద్రాల్లో అత్యధిక శాతం మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పలు పోలింగ్ కేంద్రాల్లో స్థానిక సంస్థల మాదిరి అత్యధికంగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవడంతో ఆయా కేంద్రాల ఓటర్లు బార్లు తీరారు. ముత్యాలపల్లిలో ఓటర్లు 90 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని శేరేపాలెం, మొగల్తూరు, పేరుపాలెం, తదితర గ్రామాల్లో పోలింగ్ ముగిసే సరికి కూడా ఆయా కేంద్రాల్లో ఓటర్లు బార్లు తీరారు. దీంతో వారందరికీ ఎన్నికల సిబ్బంది టోకెన్లు ఇచ్చి ఓట్లు వేయించారు.

చెదురుమదురు ఘటనలు

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలో కొన్నిచోట్ల చెదురుమదురు ఘటనలు తప్ప పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మల్లాయగూడెం, పాత చింతలపూడి గ్రామాల్లో ఇవిఎంలు పలుమార్లు మొరాయించడంతో ఓటర్లు ఇబ్బందులకు గురయ్యారు. ఎర్రగుంటపల్లి, సీతానగరం చింతంపల్లి, ప్రగడవరంలో వైసిపి టిడిపి మధ్య వాగ్వివాదాలు చోటు చేసుకున్నాయి. ధర్మాజీగూడెంలో పోలింగ్ కేంద్రం వద్ద కూడా గొడవలు జరగడంతో పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ప్రగడవరంలో వాలంటీర్‌గా పనిచేసిన వ్యక్తి ఏ వృద్ధులు వచ్చినా ఓటు వేయటానికి తీసుకెళ్లడంతో టిడిపి, వైసిపి నాయకుల మధ్య గొడవ జరిగింది. సిఐ సుధాకర్ అక్కడకు చేరుకోవడంతో సద్దుమణిగింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటింగ్ ప్రక్రియ విధానం నిదానంగా సాగడంతో ఓటర్లు కొంత ఇబ్బందికి గురయ్యారు. రేచర్ల గ్రామంలో కొందరు మహిళలు సొమ్మసిల్లి పడిపోయిన పరిస్థితి నెలకొంది. మండలంలో సాయంత్రం ఐదు గంటల వరకు 70.2 పోలింగ్ శాతం నమోదైంది.

జంగారెడ్డిగూడెం టౌన్ :మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఓటర్లు ఉదయమే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పలుచోట్ల పోలింగ్ కొంత ఆలస్యంగా ప్రారంభమైంది. కొత్తగా ఓటు హక్కు వచ్చిన యువత ఓటును వినియోగించుకోవడంలో తమ ఉత్సాహాన్ని ప్రదర్శించారు. మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. ప్రతి పోలింగ్‌స్టేషన్‌లో 85 ఏళ్ల దాటిన వయోవృద్ధులు తమ ఓటు హక్కును కుటుంబ సభ్యుల సహకారంతో వినియోగించుకున్నారు. పలుచోట్ల పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కనీస సౌకర్యాలు కల్పించలేదు. టెంట్లు చాలక ఎండలో ఓటర్లు ఇబ్బందులకు గురయ్యారు.

కామవరపుకోట : మండలంలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలోని 49 పోలింగ్ బూత్‌లలో ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. కామవరపుకోటలోని బూత్ 184లో సుమారు అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది.

ఎండ వేడి వల్ల పలువురు ఓటర్లు క్యూ లైన్లలో నిలబడి కళ్లు తిరిగి పడిపోయిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. వారికి అందుబాటులో ఉన్న మెడికల్ సిబ్బంది ప్రాథమిక చికిత్స చేసి పంపించారు. ఆడమిల్లిలోని పోలింగ్‌బూత్‌ను కాంగ్రెస్ ఏలూరు ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్య సందర్శించారు.

ముందుగా ప్రారంభమైన ఓటింగ్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఎన్నికల సమయం 7 గంటల కంటే ముందుగానే ప్రారంభమైంది. చిన్న తాడేపల్లి గ్రామంలో 6:50 నిమిషాలకు ఓటింగ్ ప్రారంభించారు. జిల్లాలోనే ముందుస్తుగా ఇక్కడ ప్రారంభమైంది. 11 గంటలకు 21.32 శాతం పోలింగ్ నమోదైంది. కాగా నియోజకవర్గంలోని 209 కేంద్రాల్లోనూ ఓటర్లు ఉదయం 7 గంటల నుంచి బార్లు తీరారు. ఎనిమిది గంటలకు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల హడావిడి కనబడింది. ఇరు పార్టీలు పోలింగ్ కేంద్రాల వద్ద శిబిరాలు వేసుకుని ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్లు, సరైన వసతులు లేకపోవడంతో ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు. నాగాలాండ్‌కు చెందిన ప్రత్యేక పోలీస్ బృందం తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ప్రతి పోలింగ్ కేంద్రాన్ని తిరుగుతూ హల్చల్ చేశారు. కొబ్బరి తోటలోని 117వ పోలింగ్ కేంద్రంలో వికలాంగుడైన వృద్ధుని ఆటోలో తీసుకొచ్చి ఓటు వేయించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం పెంటపాడు మండలం పెంటపాడు గ్రామంలో బూత్ నెంబర్ 177, డియర్ గోరింక డిగ్రీ కళాశాలలో అధికారుల నిర్లక్ష్యంతో ఎన్నికలు మందకొడిగా సాగాయి. ఉదయం 8 గంటల నుంచి క్యూలో వృద్ధులు, వికలాంగులు, మహిళలు మంచినీరు, కనీస సౌకర్యాలు కల్పించలేదని అసహనం వ్యక్తం చేశారు.

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో సాయంత్రం 5 గంటలకు 66.5 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. ఇంకా ఓటు వేయవలసిన వారు ఉండటంతో సాయంత్రం 6 తర్వాత లైన్‌లో ఉన్న వారందరికీ స్లిప్పులు ఇచ్చి వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

పెంటపాడు మండలం ఆకు తీగపాడు గ్రామంలో ఎంపిపి నెంబర్-2 స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద మహిళా ఓటర్లు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. గతంలో ఈ గ్రామంలో రెండు పోలింగ్ బూత్‌లను ఎన్నికల అధికారులు ఏర్పాటు చేసి ఓటర్లకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకునేవారు. అయితే ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఆకు తీగపాడు గ్రామానికి ఒకే పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేయడం వల్ల మహిళలు, పురుషులు ఓట్లు వేయడానికి వెళ్లే మార్గం ఇరుకుగా ఉండటం వల్ల మహిళా ఓటర్లు తీవ్ర అసహనానికి గురయ్యారు.

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో సాయంత్రం ఆరు గంటలు దాటిన తరువాత కూడా కొంత మంది ఓటర్లు తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. కొత్తూరు గ్రామంలో రాత్రి 7 గంటలకు కూడా స్థానికులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. మాధవరం గ్రామంలో ఉన్న ఇవిఎం మిషన్ సాంకేతిక లోపం వల్ల 56వ నంబర్ బూత్ 8:15 నిమిషాలకు ప్రారంభమైంది. దీంతో ఉదయాన్నే పోలింగ్ బూత్‌కి చేరుకున్న ఓటర్లు కొంత అసహనం వ్యక్తం చేశారు. కృష్ణయపాలెం కూడా ఇవిఎం మిషన్ మొరాయించడంతో ఓటింగ్ కొంత ఆలస్యంగా ప్రారంభవ అయ్యింది. మండలంలో ఎక్కడ ఎటువంటి గొడవలు జగకుండా వుండేందుకు ప్రతి బూత్ వద్ద పోలీస్ సిబ్బంది గస్తీ నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు టెంట్లు, వాటర్, మెడికల్ క్యాంపులను అధికారులు ఏర్పాటు చేశారు.

మండలంలో రాత్రి 7 గంటల వరుకు కూడా పోలింగ్ జరిగింది. మొత్తం 77.21 శాతం పోలింగ్ జరిగింది. పురుషులు 80853 మంది, మహిళలు 84745, ఇతరులు 7 మంది, మొత్తం 165605 తమ ఓటును వినియోగించుకున్నారు.

దేవదాయ ధర్మదాయ శాఖ

భూములు కౌలుకు టెండరు - కం - బహిరంగ వేలం ప్రకటన

పశ్చిమ గోదావరి జిల్లా, ఇరగవరం మండలం, రేలంగి గ్రామములో వేంచేసియున్న ఈ దిగువ ఉదహరించిన దేవస్థానములకు చెందిన భూములు 2024-25 సం.రం నుండి 2026-27 సం.రం వరకు అనగా 3 సంవత్సరములకు కౌలు హక్కు పొందుటకు గాను రేలంగి గ్రామములో శ్రీ మంటలాంబ అమ్మవారి ఆలయ ప్రాంగణము నందు ది.24.05.2024వ తేది శుక్రవారం తఱుకు దేవదాయ ధర్మదాయ శాఖ తనిఖీదారు వారి సమక్షమున టెండర్ - కం బహిరంగ వేలం పాటలు నిర్వహింపబడును. కావున ఆసక్తి గలవారు పాటలో పాల్గొనవలసినదిగా కోరడమైనది.

వ.నెం.	దేవస్థానము పేరు/గ్రామము	రి.స.నెం.	విస్తీర్ణం	ధరావతు	వేలం తేది సమయం
1.	శ్రీగోపాల & ఆంజనేయ స్వామివారి దేవస్థానం - రేలంగి	265/7 265/7	1-02 1-02	5000/- 5000/-	24-05-2024 శుక్రవారం ఉదయం గం.9.00 నుండి
2	శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానం-రేలంగి	697/3 698/1	5-31	5000/-	24-05-2024 శుక్రవారం ఉదయం గం.9.00 నుండి
		659/7, 678/3, 695/7, 696/3	4.32	5000/-	
3.	శ్రీమంటలాంబ అమ్మవారి దేవస్థానం-రేలంగి	291/2	1.59	5000/-	24-05-2024 శుక్రవారం ఉదయం గం.9.00 నుండి
		ఆలయ ప్రాంగణములో గల 58 కొబ్బరి చెట్లు ఫలసాయము లైసెన్స్ హక్కునకు		5000/-	

ముఖ్యషరతులు : 1.వేలం పాటలో పాల్గొనదలచిన వారు ప్రథమ ధరావత్తు రూ.5000/-లు చెల్లించి పాటలో పాల్గొనవలెను. పాటదారుడు తగు సాల్వెన్సీ చూపవలెను. పాట షరతులు ఇతర విషయములు కార్యాలయము పనివేళలలో అడిగి తెలుసుకొనగలరు.

గ్రామము : రేలంగి ఇట్లు: కార్యనిర్వహణాధికారి

తేది.12.05.2024 ఫోన్‌నెం.76619 45678

మొదట మందకొడిగా.. తర్వాత చురుగ్గా

పోలవరంలో పోలింగ్
అక్కడక్కడ స్వల్ప ఘర్షణలు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మండలంలో గూటాల, కొత్త పట్టిసీమ, పట్టిసీమ, పోలవరం, ఇటికలకోట, వింజరం, చేగొండపల్లి, ఎల్‌ఎన్‌డిపేట గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పోలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న పోలింగ్ స్టేషన్ 264లో ఇవిఎం మొరాయించడంతో ఎన్నికల అధికారి, తహాశీల్దార్ జివి.ప్రసాద్ వివిఎం మిషన్‌ను సరిచేయించారు. సుమారు అరగంటసేపు క్యూ లైన్‌లో ఓటర్లు ఇబ్బందులకు గురయ్యారు. అధికార పార్టీ నాయకులు సుమారు 15 ఆటోల్లో ఓటర్లను పోలింగ్ స్టేషన్ల వద్దకు తరలించారు. నియోజకవర్గంలో 1.4 లక్షల ఓట్లు పోలయ్యాయని, మండలంలో 41శాతం పోలింగ్ జరిగిందని ఎన్నికల అధికారి జివి.ప్రసాద్ తెలిపారు. మండలంలో 18 ఏళ్లు నిండి కొత్తగా ఓటు హక్కు వచ్చిన 856 మంది యువత తమ ఓటు హక్కును తొలిసారిగా వినియోగించుకున్నారు.

కొయ్యలగూడెంలో కొంత ఉద్రిక్తత

కొయ్యలగూడెం : మండలంలోని పొంగుటూరులో, కన్నాయగూడెం గ్రామాల్లో 7:19 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. పొంగుటూరులో ఓటర్లు క్రమశిక్షణ పాటించకపోవడంతో కొంత ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. 233 పోలింగ్‌కేంద్రంలో మహిళలు ఘర్షణకు దిగారు. కొయ్యలగూడెం బాయ్స్ హైస్కూల్‌లో 220, 227 పోలింగ్‌కేంద్రాల్లో పోలింగ్ మందకొడిగా సాగింది. సరిపల్లిలో ఓటింగ్ సజావుగా సాగింది. అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. రామంజుపురం, నరసాన్నపాలెం, బయ్యన్నగూడెం పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మొత్తంగా కొయ్యలగూడెం మండలంలో మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఓటర్లు ఇబ్బందులకు గురయ్యారు. క్యూ లైన్ సరైన పద్ధతిలో ఏర్పాటు చేయకపోవడంతో తోపులాటకు గురైన పరిస్థితి నెలకొంది. దాదాపుగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో పోలీసుల కొరత అధికంగా ఉంది.

ప్రశాంతంగా పోలింగ్

టి.నరసాపురం :మండలంలో సోమవారం జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం ఆరు గంటలకే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. అయితే ఓటింగ్ ప్రక్రియ మందకొడిగా సాగింది. మండలంలోని తెడ్లెం, మర్రిగూడెం, ప్రకాష్ నగర్ తదితర గ్రామాల్లో ఇవిఎంలు మొరాయించడంతో ఆయా పోలింగ్ కేంద్రాల్లో రెండు గంటలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. ఇవిఎంలు సరిగా పనిచేయకపోవడంతో గంటల తరబడి ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఎండ వేడిమి తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 11 గంటల వరుకు మందకొడిగా సాగిన ఓటింగ్ ఆతరువాత ఊపందుకుంది. మండలంలోని బొర్రంపాలెంలో ఓటర్లు అధిక సంఖ్యలో బారులు తీరడంతో ముందుగా వేసిన టెంట్లు సరిపోక మరికొన్ని వేయాల్సి వచ్చింది. మండలంలోని ప్రకాష్‌నగర్‌లో వివి ప్యాడ్‌లో స్లిప్పులు అయిపోవడంతో మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు ఓటింగ్ నిలిచిపోయింది. దీంతో ఓటర్లు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

జీలుగుమిల్లిలో ప్రశాంతం

జీలుగుమిల్లి : మండలవ్యాప్తంగా సోమవారం పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ప్రారంభ సమయంలో ఒకటి రెండు చోట్ల ఇవిఎంలు మొరాయించగా అధికారులు అప్రమత్తమై సమస్యను పరిష్కరించడంతో ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. జీలుగుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని పోలవరం డిఎస్‌పి ఎన్.సురేష్‌కుమార్‌రెడ్డి తనిఖీ చేశారు. మండలంలోని బర్రింకలపాడు గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో జనసేన ఎంఎల్‌ఎ అభ్యర్థి చిర్రి బాలరాజు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. జీలుగుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని కాంగ్రెస్ ఏలూరు ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్య సందర్శించారు.

కుక్కునూరు : కుక్కునూరు మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కొన్ని ప్రాంతాల్లో చెదురుమదురు ఘటనలు మినహా మిగిలిన ప్రాంతాల్లో పోలింగ్ సాధారణంగా జరిగింది. కొన్ని చోట్ల ఇవిఎంలు మొరాయించడంతో టెక్నికల్ సిబ్బంది సరిచేశారు. ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. ఉదయం ఏడు గంటలకే పోలింగ్ ప్రారంభం కాగా మధ్యాహ్నం మూడు గంటల సమయానికి కుక్కునూరు మండలంలో 55.01 శాతం నమోదైంది. అల్లిగూడెం పోలింగ్ కేంద్రంలో ఇవిఎంలు మొరాయించడంతో ఓటర్లు ఆందోళన వ్యక్తం చేశారు.

బుట్టాయగూడెం : మండలంలోని పోలింగ్ స్టేషన్లలో ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. సాయంత్రం సమయం ముగిసినప్పటికీ 145, 147 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు అధిక సంఖ్యలో రాత్రి 8:30 గంటల వరకు బారులు తీరారు. వీరిలో వృద్ధులు, గర్భిణులు, చంటి పిల్లల తల్లులు అధికంగా ఉన్నారు. ఇవిఎంలు పని చేస్తున్నప్పటికీ ఉదయం నుంచి సమయం ముగిసే వరకు ఓటర్లు బారులు తీరి ఉండడంపై ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. మండలంలో మొత్తం 54 పోలింగ్ కేంద్రాలు ఉండగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో దాదాపుగా ఎటువంటి సమస్యలు లేకుండా ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండలంలో 43027 మంది మొత్తం ఓటర్లు ఉండగా 35350 మంది ఓట్లు వేశారు. 82.1 శాతం పోలింగ్ నమోదైంది.

ఏలూరులో ప్రశాంతంగా పోలింగ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో సాయంత్రం ఆరు గంటల వరకు 66.25 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 2,35,345 మంది ఓటర్లకు 1,55,921 మంది సాయంత్రం ఆరు గంటలకు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. టిడిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్‌యాదవ్ వట్లూరులోని ఎంపియుపి పాఠశా లలో, టిడిపి ఎంఎల్‌ఎ బడేటి చంటి పవర్‌పేటలోని మున్సిపల్ పాఠశాలలో తమ ఓటు హక్కు వినియోగిం చుకున్నారు. వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి ఆళ్ల నాని శ్రీరామ్ నగర్ తొమ్మిదో రోడ్డులోని ఎలిమెంటరీ పాఠశాలలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. సిపిఐ ఏలూరు ఎంఎల్‌ఎ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు నగరంలోని వెంకటరావుపేట యుపి స్కూల్‌లో 96వ నెంబర్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఏలూరులో ఉదయం ఏడు గంటలకే అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద జనాలు బారులు తీరారు. చాలాచోట్ల 5, 10, 15 నిమిషాలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంబ ుమైంది. తంగెళ్లమూడి ప్రాంతంలోని కబాడీగూడెం ఎంపియుపి పాఠశాలలో పోలీసులు గేటు వేసి జనాలను లోపలకు పంపిస్తూ ఉండటంతో గేటు వద్ద తోపులాట జరిగింది. చిన్నపిల్లలతో వచ్చిన మహిళలు సైతం ఆ తోపులాటలో ఇబ్బందులు పడ్డారు. చాలావరకు ఓటర్లు రోడ్డుపైన ఎండలో నిలబడాల్సి వచ్చింది. చోడిదిబ్బ ప్రాంతంలో వికలాంగులచే నిర్వహిస్తున్న పోలింగ్ కేంద్రం అందరినీ ఆకట్టుకుంది. జెవిఆర్ నగర్‌లోని సె యింట్ జెవియర్ హైస్కూల్ వద్ద వంద మీటర్ల లోపే రాజకీయ పార్టీలు షామియానాలు వేసుకోవడంతో పోలీ సులు వాటిని తొలగించారు. సుబ్బమ్మ దేవి పాఠశాలలో వికలాంగుల కోసం నిర్మించిన ర్యాంపును సాధారణ ఓటర్లు ఆక్రమించడంతో వికలాంగులు చాలా ఇబ్బం దులు పడ్డారు.

ఏలూరు స్పోర్ట్స్ : ఏలూరు నగరంలో పలు చోట్ల పోలింగ్ గంట ఆలస్యంగా ప్రారంభమైంది. నగరంలోని ఆర్అండ్‌బి ఆఫీస్ సమీపంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ను, సిఆర్ రెడ్డి మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ను ఎస్‌పి మేరీప్రశాంతి పరిశీలించారు. వంద మీటర్ల దూరంలో ఓటు వేసిన వారే మినహా ఇంకా ఎవరూ లేకుండా భద్రత చర్యలు చేపట్టామని చెప్పారు. పలు పోలింగ్ బూత్‌లను ఏలూరు రేంజ్ డిఐజి ఐజిపి అశోక్‌కుమార్ తనిఖీ చేశారు. నగరంలోని తంగెళ్లమూడి ప్రాంతంలో ఉన్న ఆది ఆంధ్ర మున్సిపల్ పాఠశాలలో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఆయనతో పాటు రెండో పట్టణ సిఐ ప్రభాకర్, సిబ్బంది ఉన్నారు.

ఉంగుటూరులో చెదురుమదురు ఘటనలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఓటర్లలో చైతన్యం వచ్చిందో.. ఏమో కాని పోలింగ్ కేంద్రాలు ఉదయం ఏడు గంటల నుంచే కిటకిటలాడాయి. ప్రతి బూత్ వద్ద వందలాది మంది ఓటర్లు బారులు తీరారు. దానికి తగ్గట్టుగా పోలింగ్ బూత్‌లో ఓటు వేసి బయటకు వచ్చేందుకు ఆలస్యం అవ్వటంతో క్యూలైన్లు మరింత విస్తరించాయి. మహిళా ఓటర్లు పెద్ద సంఖ్యలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఎన్ఆర్ఐ ఓటర్లు సైతం ఓటు వేశారు. పిఎస్ నెంబరు 56లో కంట్రోల్ యూనిట్, పిఎస్16లో బ్యాలెట్ యూనిట్, పిఎస్ 101 బ్యాలెట్ యూనిట్, పిఎస్ 90లో వివిప్యాడ్, పిఎస్ 192లో వివి.ప్యాడ్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వాటిని మార్చామని ఆర్ఒ ఖాజావలీ తెలిపారు. కైకరంలో పిఎస్ 62లో ఇవిఎం సెట్ మొత్తం మార్చారు. భీమడోలు మండలం అన్నెవారిగూడెంలో జనసేన, వైసిపి కార్యకర్తల ఘర్షణలో ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు సోదరుడి కారు అద్దాలను పగలకొట్టంతో ఉద్రిక్తత నెలకొంది. కాగుపాడులో పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్న ఇరు పార్టీ గ్రూపులను పోలీసులు చెదరకొట్టే క్రమంలో కూటమి కార్యకర్తలు తెదేపా నాయకుడి ఇంట్లోకి పారిపోవడంతో పోలీసులు రంగప్రవేశం చేయటాన్ని తెదేపా వారు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, తెదేపా కార్యకర్తలకు వాగ్వివాదం జరిగింది. అక్కుపల్లిగోవరం, ఉంగుటూరులో ఇరు పక్షాల కార్యకర్తలు ఓటర్లను ప్రభావితం చేసేలా ప్రచారం చేయడంతో తోపులాట జరిగింది. నిడమర్రు మండలం పెదనింద్రకొలను పిఎస్ 186 వద్ద జనసేన నాయకుడి కారు అద్దాలను ధ్వంసం చేయడంతో ఆందోళన వ్యక్తమైంది. నిడమర్రు మండలం భువ్వనపల్లిలో పుప్పాల వాసుబాబు, చిననింద్రకొలనులో పత్సమట్ల ధర్మరాజులు వారి కుటుంబ సభ్యులతో ఓటు హక్కును వినియోగించుకున్నారు. గుండుగొలను 109 పిఎస్‌లో ఎండలో నిలబడలేక ఓ మహిళ సొమ్మసిల్లి పడిపోవడంతో ప్రథమ చికిత్స అందించారు. మధ్యాహ్నం మూడు గంటల వరకు 58.11 శాతం పోలింగ్ నమోదైంది.

గణపవరం : గణపవరం మండలంలో మధ్యాహ్నం మూడు గంటల వరకు 61.35 శాతం పోలింగ్ నమోదైనట్లు తహశీల్దార్ రాంబాబు చెప్పారు. ఉదయం ఏడు గంటల నుంచి మండలంలో పోలింగ్ ప్రారంభమైంది. పోలింగ్ బూత్‌ల వద్ద అధికారులు తాగునీటి వసతి ఏర్పాటు చేసినా టెంట్లు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయకపోవటంతో ఓటర్లు ఎండలో నిలబడాల్సి వచ్చింది. కేశవరంలో వైసిపి, జనసేన కార్యకర్తల మధ్య చిన్నపాటి ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు రంగప్రవేశం చేసి వారిని చెదరకొట్టారు. గణపవరం, సరిపల్లి గ్రామాల్లో ఎన్నికల బూత్‌లను ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల శ్రీనివాసరావు పరిశీలించారు.

కైకలూరులో చెదురుమదురు ఘటనలు

వింజరంలో గుండెపోటుతో ఓటరు మృతి

ప్రజాశక్తి - కైకలూరు

ఓటర్లు ఓటు వేసేందుకు బారులు తీరారు. ఎన్నడూ లేనివిధంగా సోమవారం ఉదయం ఐదు గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్దకు ఓటర్లు చేరుకున్నారు. ఉదయం పది గంటల సమయంలో ఏ కేంద్రం వద్ద చూసిన ఓటర్లు భారీగా బారులు తీరారు. కైకలూరులోని 235 పోలింగ్ కేంద్రాల్లో సకాలంలోనే పోలింగ్ ప్రక్రియ ప్రారంభించారు. మధ్యాహ్నం 12 గంటల సమయానికే 35 శాతం పోలింగ్ పూర్తయింది. సాయంత్రం నాలుగు గంటలకు 69 శాతం పోలింగ్ పూర్తయినట్లు అధికారులు ప్రకటించారు. కైకలూరులోని ఎంపియుపి పాఠశాల వద్ద జరుగుతున్న పోలింగ్ కేంద్రానికి వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి దూలం నాగేశ్వరరావు, బిజెపి ఎంఎల్‌ఎ అభ్యర్థి కామినేని శ్రీనివాసరావు ఒకే సమయానికి చేరుకొని ఓటర్లకు నమస్కరిస్తూ ముందుకు సాగారు. పోలింగ్ కేంద్రానికి సమీపంలో బిజెపి నాయకులు షామియాన వేసి ఓటర్లకు తాగునీరు, మజ్జిగ సరఫరా చేయడంపై వైసిపి అభ్యర్థి ఎన్నికల అధికారులకు, ట్రెయినీ కలెక్టర్ శ్రీ పూజకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు షామియానా తొలగించే ఏర్పాట్లు చేస్తుండగా టిడిపి కూటమి సానుభూతిపరులు అక్కడకు చేరుకున్నారు. దీంతో వైసిపి, బిజెపి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తల మధ్య స్వల్ప ఘర్షణ వాతావరణం నెలకొంది. ఆటపాకలో కూడా ఇరు గ్రూపుల వారు నెట్టుకున్నారు. పోలీసులు వారిని అడ్డుకుని పంపించి వేశారు. కైకలూరు మండలం వింజరంలో 167వ బూత్ వద్ద గోలి రత్నప్రభాకరరావు(65) ఓటు వేసేందుకు లైన్‌లో నిల్చుని గుండెపోటుకు గురై మృతి చెందారు. నియోజకవర్గంలో చెదురు మదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగినట్లు అధికారులు తెలిపారు. పలు పార్టీల అభ్యర్థులు పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లకు కనిపించారు. కొందరు స్వతంత్ర అభ్యర్థులు పోలింగ్ బూతులు వద్ద ఓటర్లను కలిశారు.

టెంట్లు చాలక ఓటర్ల ఇబ్బందులు

మండవల్లి : మండలంలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా ప్రారంభమైంది. కొన్నిచోట్ల ఇవిఎంలు మొరాయించడంతో ఓటింగ్ లేటుగా ప్రారంభించారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ఉక్కపోతతో ఓటర్లు అల్లాడిపోయారు. టెంట్లు చాలక ఎండలోనే లైన్‌లో నిల్చున్న పరిస్థితి నెలకొంది. వృద్ధులతో పాటు గర్భిణులు, చంటిపిల్లలతో కేంద్రాలకు వచ్చిన బాలింతలు ఉక్కపోతతో తీవ్ర అవస్థలు పడ్డారు. మండలంలో 3929 ఓటర్లు ఉండగా రెండు గంటల సమయానికి 18361 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోగా 46.8 శాతం ఓట్లు పోలయ్యాయి. మండవల్లిలో ఎన్నికలను ఎస్‌ఎ రామన్ పరిశీలించారు. ఎన్నికలు జరుగుతున్న విధానాన్ని, చేసిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకునేలా సహకరించాలని ఆయన పోలింగ్ అధికారులకు సూచించారు.

ప్రశాంతంగా పోలింగ్

కలిదిండి : మండలంలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. మండలంలో రాత్రి ఏడు గంటల వరకు 78 శాతం పోలింగ్ నమోదైంది. ఎండలకు భయపడ్డ ఓటర్లు ఉదయం ఏడు గంటలకే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పలుచోట్ల పోలింగ్ అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది. మండలంలోని మోడల్ పోలింగ్ కేంద్రమైన ఎస్ఆర్‌పి అగ్రహారం ఎంపియుపి స్కూల్ 197 బూత్‌లో ఓటు వేసేందుకు లైన్‌లో నిల్చున్న 80 ఏళ్ల వృద్ధుడు గోనె వెంకటేశ్వరరావు, 32 ఏళ్ల పరసా నాగమణి సొమ్మసిల్లి పడిపోవడంతో అక్కడే ఉన్న వైద్య సిబ్బంది సపర్యలు చేశారు. రెండు స్టాండ్ ఫ్యాన్లు తీసుకు వస్తే, ఒకటి పని చేయడం లేదని సిబ్బంది తెలిపారు. వెంకటాపురంలో ఎంపియుపి స్కూల్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది ఎండ వేడిమికి తాళలేక తాడిచెట్ల కింద సేదతీరారు. సానా రుద్రవరం ఎంపియుపి స్కూల్‌లో 199, 200 బూత్ ముఖ ద్వారం వద్ద బారికేడ్లు లేకపోవడంతో మహిళలు, పురుషుల మధ్య తోపులాట జరిగింది. 191 బూత్‌లో హైదారాబాద్ నుంచి వచ్చిన సాఫ్ట్ వేర్ ఎ.తనూజ ఓటు వేసేందుకు లోపలికి వెళ్లగా, మీరు ఓటు వేశారని సిబ్బంది చెప్పగా, ఆమె వేయలేదని చెప్పడంతో పరిశీలించిన అనంతరం ఆమెకు ఛాలెంజ్ ఓటును కల్పించారు. కోరుకొల్లు 214 బూత్‌లో టిడిపి కూటమి ఏజెంట్‌పై వైసిపి నాయకులు దాడి చేయగా గాయాలపాలైన బాధితుడు కలిదిండి పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాడు. 108లో కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చెదురుమదురు కేకలు, తోపులాటలు మినహా మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.



బడేటి చంటి

బండి వెంకటేశ్వరరావు

ఆళ్ల నాని

సొంగా రోషన్‌కుమార్

సార్వత్రిక సంగ్రామం



గ్రంధి శ్రీనివాస్

పులపర్తి రామాంజనేయులు

పితాని సత్యనారాయణ

చెరుకువాడ శ్రీరంగనాథరాజు

ఓటెత్తారు..

ప్రశాంతంగా పోలింగ్

సోమవారం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు పోటెత్తారు. 2024 అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కేంద్రాల వద్ద ఓటర్లు క్యూకట్టారు. వివిధ పార్టీల అభ్యర్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పలు చోట్ల ఇవిఎంలు మొరాయించాయి. దీంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. ఈ సారి యువత సైతం ఎక్కువ సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

భీమవరంలో కుటుంబ సమేతంగా ఓటేసిన వైసిపి ఎంపీ అభ్యర్థి ఉమాబాల



ఓటేసిన నరసాపురం వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు



నిడమర్రులో ఓటేసిన వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి వాసుబాబు

ఓటేసిన నరసాపురం జనసేన ఎంఎల్‌ఎ అభ్యర్థి నాయకర్

ఓటేసిన చింతలపూడి వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి విజయరాజు

పాలకొల్లులో..



ఓటేసిన మంతెన రామరాజు దంపతులు



ఓటేసిన వేసిన అంగర దంపతులు



అమలాపురంలో ఓటేసిన కాంగ్రెస్ నరసాపురం ఎంపీ అభ్యర్థి నాయుడు

మండవల్లిలో..

కలిదిండిలో..

చాట్రాయిలో..

కైకలూరులో..



కామవరపుకోటలో వృద్ధుడిని ఓటేసేందుకు తీసుకెళ్తున్న వైనం

భీమవరంలో..

దెందులూరులో..

కాళ్లలో..

మొగల్తూరులో ఓటేసేందుకు వెళ్తున్న వృద్ధురాలు

జీలుగుమిల్లిలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న కాంగ్రెస్ ఏలూరు ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్య



నరసాపురంలో ఓటువేసిన కాంగ్రెస్ అభ్యర్థి బజ్జి



ఆగిరిపల్లి : ఓటు వేసిన వృద్ధుడు

కుటుంబ సమేతంగా ఓటువేసిన ఫార్వర్డ్ బ్లాక్ ఎంఎల్‌ఎ అభ్యర్థి శివ



కుటుంబసమేతంగా ఓటువేసిన తణుకు టిడిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి రాధాకృష్ణ

పాలకొల్లులో ఓటువేసిన వైసిపి అభ్యర్థి గుడాల గోపి

ఓటువేసిన మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు



ఏలూరులో ఓటువేసిన మేయర్ దంపతులు, మంచెం మైబాబు

రఘురామకృష్ణంరాజు

పివిఎల్ నరసింహరాజు

నిమ్మల రామానాయుడు

పుట్టా మహేష్ కుమార్

అబ్బయ్య చౌదరి

చింతమనేని ప్రభాకర్



ఉన్నమట్ల ఎలిజా



తెల్లం రాజ్యలక్ష్మి



కృష్ణంరాజు సతీమణి శ్యామల

కనుమూరి బాపిరాజు

పీతల సుజాత

టి.నరసాపురంలో..

దెందులూరులో దాడులు, ఘర్షణలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

చెదురు మదురు సంఘటనలు మినహా దెందులూరు నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంత వాతావరరణంలో జరిగింది. సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు 58.06 శాతం పోలింగ్ నమోదైంది. చాలా చోట్ల ఓటర్లు ఉదయం ఏడు గంటలకే క్యూలైన్లలో బారులు తీరారు. 6.30 గంటలకు మాక్ పోలింగ్ అనంతరం ఏజెంట్ల సమక్షంలో ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభిం చారు.

దెందులూరులో ఉదయం ఏడు గంటలకు క్యూలైన్‌లో ఓటరు బారులు తీరారు. వైసిపి దెందులూరు ఎంఎల్ఎ అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరి కొండలరావు పాలెంలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. టిడిపి దెందులూరు ఎంఎల్ఎ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ దుగ్గిరాలలో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. టిడిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ పొట్లూరులో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఘర్షణలు

నియోజకవర్గంలో పోలింగ్ జరిగే అనే కేంద్రాల వద్ద వాగ్వివాదాలు, ఘర్షణలు చోటు చేసుకున్నాయి. దుగ్గిరాలలో పోలింగ్ జరుగుతున్న సమయంలో అక్కడకు చేరుకున్న చింతమనేని ప్రభాకర్ ఏజెంట్లు, వ్యక్తులు అక్కడ ఉండకూడదని, సీనియర్ సిటిజన్స్‌కి కుర్చీలు ఏర్పాటు చేస్తామని సందర్భంలో వైసిపి వారు ఘర్షణకు దిగారు. ఒక దశలో పోలీసులకు చింతమనేనికి కూడా వాగ్వివాదం చోటు చేసుకుంది. అశోక్ కుమార్ కేంద్రాన్ని సందర్శించి వెళ్లారు. ఏలూరు మండలం శ్రీపరులో వైసిపికి చెందిన కొందరు వ్యక్తులు టిడిపికి చెందిన వ్యక్తులపై దాడి చేయడంతో వారు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. జగన్నాధపురంలో టిడిపికి చెందిన ఒక యువకుడిపై వైసిపికి చెందిన వారు దాడి చేయడంతో సదరు యువకుడు గాయపడ్డాడు. ఈ విషయాలను చింతమనేని ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఎస్‌పికి ఫోన్ చేసి కేసులు పెట్టాలని కోరారు. గొడవ నేపథ్యంలో జగన్నాధపురంలో ఒక పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ ఆలస్యమైంది. సోమవరప్పాడులో టిడిపికి చెందిన ఒక మహిళపై వైసిపికి చెందిన కొందరు దాడి చేశారు. ఏలూరు మండలం పాలగూడెంలో టిడిపికి చెందిన వ్యక్తిపై వైసిపికి చెందిన వ్యక్తి బ్లేడ్‌తో దాడి చేయడంతో ఆ వ్యక్తి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు.

ఎండలో మగ్గిన ఓటర్లు

పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్లు సరిపోకపోవడంతో దిబ్బగూడెం, లక్ష్మీపురం గ్రామాల్లో ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎండలో నిల్చోవాల్సి వచ్చింది. వంద మీటర్ల నిబంధన ఎక్కడ కానారాలేదు. చాలా చోట్ల వైసిపి, టిడిపి శ్రేణులు క్యాంపులు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల తాగునీటి సదుపాయం అంతంత మాత్రంగానే ఉంది. జగన్నాధపురం, దుగ్గిరాల, వేగివాడ తదితర చోట్ల క్యూ లైన్లు భారీగా ఉండతంతో ఓటర్లు తీవ్ర అసహనానికి గురయ్యారు.

వసతుల్లేక ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - ఆచంట

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ఆచంట నియోజకవర్గంలో ఉదయం చెదురుముదురు సంఘటన మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అక్కడక్కడ ఇవిఎంలు మొరాయించడంతో పలు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియ ఆలస్యంగా నడిచింది. పలు కేంద్రాల్లో ఓటర్లు పెద్ద ఎత్తున తరలి రావడంతో పోలింగ్ ఆలస్యమైంది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైనా సుమారు 8 గంటల వరకు నెమ్మదిగా సాగింది. ఎనిమిది గంటల తర్వాత పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. మండుటెండలో క్యూలో నిలబడి ఓటు వినియోగించుకున్నారు. ఆచంట మండలంలో కొడ మంచిలి, వల్లూరు, ఆచంట వేమవరం, ఆచంట కరుగో రుమిల్లి గ్రామాల్లో టిడిపి, వైసిపి నాయకులు ప్రచారం చేయడంతో ఇరు పార్టీల కార్యకర్తల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుని తోపులాటలు జరిగాయి. అనంతరం పోలీసులు జోక్యం చేసుకుని ఇరు పార్టీలను చెదరగొట్టారు.

పెనుమంట్ర : మార్టేరు ఎస్‌విజి పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు, పోలీసు సిబ్బంది మధ్య సోమవారం ఉదయం కొద్దిపాటి ఘర్షణ జరిగింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు వేయడానికి వచ్చిన వారి వద్ద మొబైల్ ఉంటే లోపలికి వెళ్లి ఓటు వేయడానికి కుదరదు అనడంతో కొందరు ఓటర్లు ధ్వజమెత్తారు. పోలింగ్ కేంద్రాల వద్ద సెల్ ఫోన్‌లు పెట్టుకోవడానికి ప్రత్యేక డ్రైవ్ లాంటిది ఏర్పాటు చేయకుండా వెనుకకు పంపడం సరికాదని వారు ఘర్షణకు దిగారు. కొన్ని పోలింగ్ స్టేషన్‌ల వద్ద వంద మీటర్ల పరిధి అతిక్రమించి కొన్ని రాజకీయ పార్టీల కార్యకర్తల గుర్తులు ప్రచారం చేయడం, ఓటర్లను ఫలానా గుర్తుకు ఓటు వేయమని అడగడం, పరస్పరం ఘర్షణలకు దిగడం జరిగినా పోలీసుల ప్రమేయంతో అవి అక్కడే ముగిసిపోయాయి.

పోడూరు: మండలంలో ఉదయం 7 గంటల నుండే పోలింగ్ ప్రారంభం కాగా అక్కడక్కడా చిన్న, చిన్న చెదురు మదురు ఘటనలు తప్ప ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగలేదు. మండల వ్యాప్తంగా 54 బూత్‌ల్లో ఎన్నికలు జరగగా కొన్ని బూత్‌లలో సాయంత్రం 8 దాటే వరకు కూడా పోలింగ్ జరిగింది.

సరైన వసతులు లేక స్థానికులు ఆగ్రహం

పెనుమంట్ర : మండల పరిధిలోని గరువు గ్రామంలో పోలింగ్ బూత్ వద్ద ఏర్పాట్లు సరిగ్గా లేవని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం స్థానిక ఎన్నికల పోలింగ్ వద్ద కనీస వసతులు లేక, ఎండలో, క్యూలైన్లో నిలబడ లేక ఓటర్లు ఇబ్బంది పడ్డారు. పోలింగ్ స్టేషన్ బయట నీడకోసం అవసరం అయినన్ని శామియానాలు వేయించడంలో అధికారులు నిర్లక్ష్యం చేశారని, ఏర్పాట్లపై వారంతా అసంతృప్తి వ్యక్తం చేశారు.

నూజివీడులో ప్రశాంతం

ప్రజాశక్తి - ముసునూరు

నూజివీడు నియోజకవర్గ పరిధిలో ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. నియోజకవర్గ పరిధిలోని ముసునూరు, చాట్రాయి, నూజివీడు, ఆగిరిపల్లి మండలాల్లోని పట్టణం, గ్రామాల్లో ప్రజలు ఉత్సాహంగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పట్టణంలోని డాక్టర్ ఎంఆర్.అప్పారావు కాలనీలో రాత్రి ఏడు గంటల వరకు ప్రజలు ఓట్లు వేశారు. నూజివీడు మండలంలోని వెంకటాయపాలెం, ముసునూరు మండలంలోని గోపవరం, చెక్కపల్లి, రమణక్కపేట, ఆగిరిపల్లి మండలంలోని ఈదర గ్రామాల్లో చెదురు మదురు సంఘటనలు మినహా మొత్తంగా పోలింగ్ ప్రశాంతమైన వాతావరణంలో జరిగింది.

చాట్రాయి : చాట్రాయి మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. 18 గ్రామ పంచాయతీల్లో 90 శాతం ఓటింగ్ నమోదైనటు ఎన్నికల అధికారులు తెలిపారు.

ముసునూరు : నూజివీడు డివిజన్ పరిధిలోని 286 పోలింగ్ కేంద్రాల్లో స్వల్ప ఘర్షణలే తప్ప పోలింగ్ సజావుగా సాగింది. మండలంలోని గోపవరం గ్రామ పరిధిలోని 95, 96 పోలింగ్ బూత్‌లలో గోపవరం గ్రామానికి చెందిన వృద్ధురాలు ఓటు వేసే సమయంలో ఆమె చెప్పిన గుర్తుకు కాకుండా, వేరే గుర్తుకు ఓటు వేసిన పోలింగ్ శాఖ అధికారిపై వృద్ధురాలి బంధువులు ఘర్షణకు దిగారు.

ఆగిరిపల్లి : మండల కేంద్రమైన ఆగిరిపల్లితో సహా పలు గ్రామాల్లో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగింది. ఆగిరిపల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూల్, ఆగిరిపల్లి మెయిన్ ప్రాథమిక పాఠశాల, కొండకాలనీ పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈదులగూడెం గ్రామంలో శతాధిక వృద్ధుడు జాలిపర్తి వెంకటరత్నం(104)తన ఓటు హక్కును వినియోగించుకుని యువతకు స్ఫూర్తిని నింపారు. ఆగిరిపల్లికి చెందిన వరదా ఓంప్రకాశ్ దంపతులు వ్యాపార రీత్యా బెంగుళూరులో ఉంటూ తమ ఓటుహక్కును సద్వినియోగం పర్చుకోవడం కోసం ఆగిరిపల్లి వచ్చారు.

ముదినేపల్లిలో పోటెత్తిన ఓటర్లు

ముదినేపల్లి : ముదినేపల్లి మండలంలో సార్వత్రిక ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. పోలింగ్ బూతులు వద్ద కొందరు వృద్ధులు ఎండ తీవ్రతకు సొమ్మసిల్లారు. దీంతో వైద్య సిబ్బంది వృద్ధులకు వైద్య సేవలందించారు. మండలంలో పలుచోట్ల ఏడు గంటలకు ప్రారంభం కావాల్సిన పోలింగ్ పలుచోట్ల అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది. పలు చోట్ల ఇవిఎం లు మొరాయించటంతో వెంటనే వాటికి సిబ్బంది మర మ్మతులు చేపట్టి వినియోగంలోకి తెచ్చారు.

ఇరు పార్టీల నాయకుల ఘర్షణ

గురజ గ్రామంలో రెండు పార్టీలకు చెందిన నాయకులు ఘర్షణకు దిగి కొట్టుకున్నారు. ఓటర్లను ప్రభావితం చేస్తున్నారనే కారణంతో ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు తలపడటంతో వారి చొక్కాలు చినిగిపోయాయి. గురజ శివాలయం దగ్గర స్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ సమీపంలో రెండు పార్టీలకు చెందిన నాయకులు ఘర్షణలకు దిగారు. పోలీసుల జోక్యంతో ఈ రెండు సంఘటనలు సద్దుమణిగాయి. కాకరవాడ శివారు దేవరం పోలింగ్ బూత్‌లో మాజీ వాలంటీర్ ఏజెంట్‌గా ఉండి వృద్ధులను ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేయ్యాలంటూ ప్రభావితం చేస్తుండడంతో టిడిపికి చెందిన నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అక్కడ రెండు పార్టీలకు చెందిన నాయకుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది.

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం పట్టణం, మండలం పరిధిలో చిన్నపాటి వివాదాలు తప్ప ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. కొన్నిచోట్ల ఇవిఎంలు మొండికేయడంతో పోలింగ్ ఆలస్యంగా మొదలయ్యాయి. కొన్ని బూత్‌లలో ఇవిఎంలు నెమ్మదిగా ఉండడంతో ఓటింగ్ మందకొడిగా సాగింది. ఉదయం 7 గంటల నుంచి ఓటర్లు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీశారు. భీమవరం నియోజవర్గంలో రెండు లక్షల 53 వేల 116 ఓట్లు ఉండగా ఉదయం నుంచి ఉత్సాహంగా ఓట్లు వేసేందుకు వచ్చిన ఓటర్లు జివిఎంలు మొరాయించడంతో అసహనానికి గురయ్యారు.

వీరవాసరం మండలంలో ఒక వ్యక్తి తనకు కళ్లు కనిపించవని ఓటు గ్లాస్ గుర్తుకు వేయాలని బూత్‌లో ఉన్న ఎన్నికల అధికారిని కోరడంతో ఆయన ఫ్యాన్ గుర్తుకి నొక్కించడంపై వివాదం తలెత్తింది. నియోజకవర్గం మొత్తం

ప్రశాంతంగా పోలింగ్

చిన్నపాటి వాగ్వాదాలు, తగాదాలతో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఉదయం నుంచి ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బార్లు తీరారు. కేంద్రాల్లో మాక్ పోలింగ్ తర్వాత ఓట్లు వేసేందుకు ఓటర్లను ఎన్నికల అధికారులు 7 గంటలకు అనుమతిచ్చారు. దీంతో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలిసారి ఓటు వచ్చిన యువత కూడా ఓటు వేసేందుకు ఆసక్తి చూపించారు. అలాగే నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు.

వీరవాసరం: వీరవాసరం మండలంలో స్వల వివాదం మినహా మొత్తం పోలింగ్ ప్రశాతంగా ముగిసింది. ఎండ వేడిమి దృష్టిలో పెట్టుకుని ఉదయం నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. వీరవాసరం బూత్ నెం.182, పెర్కిపాలెం బూత్ నెం.37లలో ఇవిఎంలు మొరాయించడంతో సుమారు అరగంట పాటు పోలింగ్ పక్రియ అలస్యమైంది.

ఇదేవిధంగా వీరవాసరం బూత్ నెం 185లో పోలింగ్ సిబ్బంది పోలింగ్ ప్రారంభసమయానికి సమయత్నం ఆలస్యమవడంతో ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు. ఈ పోలింగ్ కేంద్రం చిరునామా ఓటు స్లిప్‌లో తప్పుగా ముద్రించడంతో ఇబ్బంది పడ్డారు. మాజీ మంత్రి పీతలసుజాత తన స్వగ్రామంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మత్స్యపురిలో వైసిపి, జనసేన నాయకులు మధ్య స్వల్ప వివాదం జరిగింది. వీరవాసరం బూత్ నెం.178లో ఒక ఓటరు తన ఓటు బూత్ ఆఫీసర్ తనచే తప్పుగా వేయించాడంటూ ఫిర్యాదు చేయడంతో తహశీల్దార్ సుశీలదేవి విచారణ నిమిత్తం ఫిర్యాదును పైఅధికారులకు పంపామని తెలిపారు.

ఓ(పో)టెత్తిన జనం..!

(మొదటి పేజీ నుంచి)

ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో ఇరుగ్రూపుల మధ్య ఘర్షణ చోటుచోసుకోవడంతో పోలీసులు రంగప్రవేశం చేసి సద్దుమణిచారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో టిడిపి, వైసిపి గ్రూపుల మధ్య ఘర్షణ జరగడంతో పోలీసులు లాఠీఛార్జి చేశారు. రెండు జిల్లాల్లోనూ చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా సాగింది.

సాయంత్రం ఐదుగంటలకు పోలింగ్ ఇలా

రెండు జిల్లాల్లోనూ ఓటర్లు పెద్దఎత్తున ఓటు హక్కు వినియోగించుకోవడంతో సాయంత్రం ఐదు గంటలకు ఏలూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 72.03 శాతం, పశ్చిమగోదావరి జిల్లాలో 68.36 శాతం ఓటింగ్ జరిగింది. అత్యల్పంగా ఏలూరు నియోజకవర్గంలో 64.59 శాతం పోలింగ్ జరిగింది. సాయంత్రం ఆరు గంటలు దాటిన తర్వాత పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు ఉండటంతో వారికి ఓటువేసే అవకాశం కల్పించారు.

పశ్చిమాన నత్తనడకన పోలింగ్

(మొదటి పేజీ నుంచి)

సుమారు రెండు గంటలు సమయం పట్టడంతో ఓటర్లు నిరీక్షించలేక వెనుదిరిగిన పరిస్థితి పలుచోట్ల కన్పించింది. దీనికితోడు ఎండతీవ్రత కూడా అధికంగా ఉండడంతో ఓటర్లు ఎండ వేడిమికి తట్టుకోలేక కొంతమంది ఇంటిబాట పట్టారు.

జిల్లాలో ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ సోమవారం జరిగింది. జిల్లాలో 14,72,923 మంది ఓటర్లు ఉండగా 1463 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో సమయానికే మాక్ పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. అనంతరం సాధారణ పోలింగ్ మాత్రం కొన్ని ప్రాంతాల్లో నిర్ణీత సమయానికి ప్రారంభం కాలేదు. ఇవిఎం మొరాయింపుతోపాటు పలు సమస్యలు ఏర్పడటంతో ఈ దుస్థితి ఏర్పడింది. అయితే గత ఎన్నికల్లో నమోదైన పోలింగ్ శాతాన్ని అధిగమించాలని అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టినా పోలింగ్ ప్రక్రియ ముందుకు సాగే పరిస్థితి కన్పించలేదు. భీమవరం మండలం దిరుసుమర్రులోని 204వ పోలింగ్ బూత్‌లో ఇవిఎం మొరాయించింది. తర్వాత పోలింగ్ ప్రారంభించినా మధ్యాహ్నానికి కేవలం 70 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. దీనిపై ఓటర్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదనే విమర్శలు విన్పించాయి. కాళ్ల మండలం జువ్వలపాలెంలో 209 పోలింగ్ బూత్‌లో ఇవిఎంలు మొరాయించాయి. రెండు బ్యాలెట్ బాక్స్‌లు, ఒక కంట్రోల్ యూనిట్ పని చేయలేదు. కొత్తవి తీసుకొచ్చి ప్రారంభించడానికి ఆలస్యమైంది. ఆకివీడు మండలం అయిభీమవరంలో ఇవిఎంలు మొరాయించాయి. ఇంజినీర్, ఎంపిడిఒ అక్కడికి చేరుకుని వాటిని సరి చేయడంతో 15 నిమిషాలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. నరసాపురం పట్టణంలో 42వ నెంబర్ పోలింగ్ బూత్‌తో ఇవిఎం మొరాయించడంతో పోలింగ్ గంట ఆలస్యమైంది. ఉండి మండలం వాంద్రంలోనూ అదే పరిస్థితి ఏర్పడింది. పాలకొల్లు పట్టణంలోని హౌసింగ్ బోర్డులోని శ్రీ వెంకటేశ్వర మున్సిపల్ స్కూల్‌లోని 118వ నెంబర్ పోలింగ్ బూత్‌లోని ఇవిఎం సుమారు 45 నిమిషాలు పని చేయకపోవడంతో ఓటర్లు అధికారులపై మండిపడ్డారు. తాడేపల్లిగూడెం మండలం కృష్ణయ్యపాలెంలో మాక్ పోలింగ్ అనంతరం ఇవిఎం పని చేయకపోవడంతో పోలింగ్ కేంద్రం వద్ద గందరగోళం నెలకొంది. వీరవాసరం మండలం పెర్కిపాలెంలోని ఒకటో పోలింగ్ కేంద్రంలో సుమారు అరగంటసేపు పోలింగ్ నిలిచిపోయింది. ఓటర్లు పెద్దసంఖ్యలో బూత్‌లకు తరలొచ్చినా పోలింగ్ మాత్రం నత్తనడకన సాగింది. దీంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లావ్యాప్తంగా ఉదయం 9 గంటలకు 9.61 శాతం, 11 గంటలకు 23.26 శాతం, మధ్యాహ్నం ఒంటిగంటకు 39.06 శాతం, మధ్యాహ్నం 3 గంటలకు 53.67 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది.

సౌకర్యాలు లేక అవస్థలు

పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు లేక ఓటర్లు తీవ్ర అవస్థలు పడ్డారు. ఓటు వేసేందుకు కేంద్రాలకు ఓటర్లలో తరలొచ్చి బారులు తీరారు. అయితే పూర్తిస్థాయిలో టెంట్లు ఏర్పాటు చేయకపోవడంతో ఓటర్లు ఎండలో మాడిపోయారు. దీంతో చెట్ల కిందకు, కార్యాలయాల మెట్ల కింద తలదాచుకోవాల్సి వచ్చింది. పాలకోడేరు, గొల్లలకోడేరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు ఇరుగ్గా ఉండటంతో మహిళా ఓటర్లు తీవ్ర అవస్థలు పడ్డారు. పాలకోడేరులో ఓటర్లు బారులు తీరడంతో తలుపులు మూసి కొంతమంది చొప్పున పోలింగ్ కేంద్రంలోకి పంపిస్తున్న సమయంలో తోపులాట చోటుచేసుకుంది. పోలింగ్ కేంద్రాల వద్ద కనీసం తాగునీరు సౌకర్యం కల్పించిన దాఖలాలాల్లేవు. రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన శిబిరాల వద్ద ఓటర్లు అల్పాహారం, తాగునీరు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనీసం వికలాంగులకు సైతం వీల్‌ఛైర్‌లు ఏర్పాటు చేయలేదు. తాడేపల్లిగూడెం కోడే వెంకట్రావు స్కూల్లో ఓటరుకు ఫిట్స్ రావడంతో ఆసుపత్రికి తరలించారు. హైస్కూల్లో ప్రాంగణంలో టెంట్లు లేక ఎండలో నిరీక్షించడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని ఓటర్లు చెబుతున్నారు. రాజకీయ పార్టీలు ఆటోల్లో ఓటర్లను తరలించాయి. అయితే ఆటోల్లో తీసుకొచ్చిన ఓటర్లను మళ్లీ ఇళ్లకు చేర్చకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల దూరంలో ఎటువంటి కార్యకలాపాలూ నిర్వహించకూడదనే నిబంధన ఉన్నప్పటికీ రాజకీయ పార్టీలు విరుద్ధంగా వ్యవహరించాయి. ఆయా పార్టీల ఆధ్వర్యంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, ఇతర శీతల పానీయాలు పంచి ఓటర్లను ప్రలోభ పెట్టారు.

మందకొడిగా సాగిన పోలింగ్

పలుచోట్ల మొరాయించిన ఇవిఎంలు

ప్రజాశక్తి - ఉండి

ఉండి మండల వ్యాప్తంగా సోమవారం ఉదయం నిర్వహించిన మాక్ పోలింగ్ ఉదయం నుంచి మందకొడిగా సాగింది. ఉదయం వాండ్రం, ఉండి బూత్ నెంబర్ 73, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని బూత్‌లలో ఇవిఎంలు పనిచేయకపోవడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ బూత్‌లు, ఉండి బూత్ 76లో ఓటర్లు ఎండలో శ్రమించక తప్పలేదు. ఉండి బూత్ 76లో సాగిరాజు మణి అనే మహిళ ఓటు వేయడానికి వెళ్లగా అప్పటికే ఆమె ఓటు వేసి ఉండడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితులలో ప్రిసైడింగ్ అధికారి ఆమెకు ఛాలెంజింగ్ ఓటు ఇవ్వక తప్పలేదు. పోలింగ్ బూత్‌లో ఎంపీ, ఎంఎల్ఎ క్యాబిన్‌లపై పేర్లు నమోదు చేయకపోవడంతో నేషనలిస్ట్ జనశక్తి పార్టీ ఉండి నియోజకవర్గ అభ్యర్థి కడియం సూరిబాబు అధికారులను ప్రశ్నించగా అధికారులు అసహనం వ్యక్తం చేయడంతో రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు.

ఉండి అసెంబ్లీ నియోజకవర్గంలో సాయంత్రం 5 గంటల వరకు 71.31 శాతం పోలింగ్ నమోదు కాగా, 1,60,251 ఓట్లు పోలైయ్యాయి.

కాళ్ల: సార్వత్రిక ఎన్నికల నాలుగో విడతలో భాగంగా ఉండి నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా సాగింది. పోలింగ్ కేంద్రాలలో పటిష్టమైన పోలీసు భద్రత మధ్య ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా నిర్వహించారు. జువ్వలపాలెం గ్రామంలో 209 పోలింగ్ బూత్‌ల్లో మూడు ఇవిఎంలు మొరాయించాయి. రెండు బ్యాలెట్ బాక్స్‌లు, ఒకటి కంట్రోల్ బాక్స్ పనిచేయలేదు. మరో మూడే మూడింటిని తీసుకొచ్చి 7 గంటల 5 నిమిషాలకు పోలింగ్ ప్రారంభించారు. నియోజకవర్గంలో పలు పోలింగ్ బూత్‌ల్లో అక్కడక్కడా ఇవిఎంలు మొరాయించాయి. పలు కేంద్రాల్లో అయితే ఓటర్లు బారులు తీరి ఓటుహక్కు వినియోగించుకున్నారు.

ప్రజలు సోమవారం ఉదయం నుంచి ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లడంతో క్యూలో నిలబడి ఓట్లు వేశారు. మహిళా ఓటర్లు ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేశారు. చెరుకువాడ గ్రామంలో 89,90,91 బూత్‌ల్లో ఓటు వేసేందుకు మహిళా ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. ఉండి హై స్కూల్‌లో పోలింగ్ కేంద్రం వద్ద జనం బారులు తీరారు. ఓటర్లకు సరిపడా టెంట్లు కూడా ఏర్పాట్లు చేయలేదు. కాళ్ల గ్రామంలో వికలాంగులు, సీనియర్ సిటిజన్స్‌కు వీల్‌ఛైర్స్ అందుబాటులో లేదు. దీంతో వృద్ధ మహిళ ఓటు వేసేందుకు ఇబ్బందిపడుతూ నడిచి వెళ్లాల్సి వచ్చింది. బొండాడ గ్రామంలో వృద్ధ మహిళను ఓటు వేయించేందుకు పోలింగ్ సిబ్బంది

పాలకోడేరు : ఓటు వేయడానికి బారులు తీరిన మహిళా ఓటర్లు

తీసుకువెళుతున్నారు. కాళ్లకూరు, అయిభీమవరంలో ఉదయం 7 గంటలకు ఓటర్లు భారీ క్యూలో నిలబడ్డారు.

ఆకివీడు: మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం ముందే ఓటర్లు బారులు తీరారు. పలుచోట్ల వృద్ధులు, మహిళలు ముందుగా ఆరు గంటలకే వచ్చి క్యూలో కూర్చున్నారు. మండలంలోని అయిభీమవరంలో మాజీ పార్లమెంటేరియన్, కాంగ్రెస్ బ్లాక్ నాయకులు కనుమూరి బాపిరాజు 7 గంటల 20 నిమిషాలకే ఓటుహక్కు వినియోగించుకున్నారు. సరిగ్గా అదే సమయంలో మరోక బూత్‌లో అదే గ్రామానికి చెందిన ఓటర్, టిడిపి అభ్యర్థి కార్మూరి రఘురాంకృష్ణంరాజులు ఒకే సమయానికి ఓటు వేశారు. రఘురామకృష్ణంరాజు బాపిరాజు అన్న కుమారుడు కావడంతో ఓటింగ్ అనంతరం ఇరువురు కొద్దిసేపు బాపిరాజు నివాసంలో గడిపారు. ఇక మండలంలో మరో

ఆకివీడు: ఉదయం 7 గంటలకు క్యూలో ఉన్న జనం

ప్రముఖులారాలు అయిన నగర పంచాయతీ ఛైర్పర్సన్ జాన్ హైమావతి తమ ఓటును ఆలస్యంగా సాయంకాలం 4 గంటలకు వినియోగించుకున్నారు. కాగా ఉదయాన్నే వృద్ధులు ఓటింగ్‌కు రావడంతో పోలింగ్ నిదానంగా సాగింది. ఒక్కొక్కరు ఓటుకి పది నిమిషాలపైన సమయం తీసుకోవడంతో తక్కువ పోలింగ్ జరిగింది. పలుచోట్ల ఇదే పరిస్థితి కొనసాగింది. కాగా దుంపగడపతో సహ మరికొన్ని చోట్ల ఇవిఎంల ప్రభావంతో పోలింగ్ నిదానంగా సాగింది. వృద్ధులకు హోమ్ ఓటింగ్ విధానం ప్రవేశపెట్టినప్పటికీ లెక్కకు మించిన వృద్ధులు బూత్‌ల వద్దే ఓటు వేశారు. ఈ వృద్ధుల ఓటింగ్ సంఖ్య ప్రతి మండలానికి పరిమితం చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. కాగా ఈ దఫా యువత ఎక్కువ స్థాయిలో పోలింగ్‌లో పాల్గొనడం విశేషం.

ఊహ కందని పోలింగ్: పోలింగ్ మాత్రం ఊహకందని రీతిలో జరిగింది. సాధారణంగా సార్వత్రిక ఎన్నికలకు ఈ ప్రాంతంలో గతంలో 70 నుంచి 75 శాతం పోలవడం ఆచారం. పలుచోట్ల సాయంత్రం 6 గంటలకు ఇంకా ఓటర్లు లైన్‌లో ఉండగానే 80 శాతం పోలింగ్ దాటిపోయింది. అయితే అక్కడక్కడా 85 దగ్గరగా పోలైనా, మొత్తం మీద 80 దాటి పోల్ కానుంది. స్థానిక సంస్థల తరహాలో పోలింగ్ జరగడం విశేషం. అయితే ఇంత భారీ స్థాయిలో జరిగిన పోలింగ్ ఎవరికో ఒకరికి తీవ్రమైన ప్రభావం చూపుతుందని గతంలో పరిశీలకులు అంచనా వేసేవారు. ఈ దఫా కూడా ఈ ఓటింగ్ పరిస్థితి అధికార పార్టీకి అనుకూలమా.. వ్యతిరేకమా అన్నది ఇక్కడ గమనార్హం. ఏదిఏమైనా పోలింగ్ మాత్రం పరిశీలకులకు అందని స్థాయిలో జరిగింది.

పాలకోడేరు : పాలకోడేరు మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. సాయంత్రం 6 గంటలకు 70 శాతం పైగా ఓటింగ్ పోలయ్యింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. ఈ మండలంలో రెవెన్యూ, పోలీస్ అధికారులు గ్రామ గ్రామాన సభలు, సమావేశాలు పెట్టి శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలని, తుంటరి వేషాలు వేస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించి ఎన్నికలపై పూర్తి అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. శృంగవృక్షం, పెన్నాడ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఉదయం ఇవిఎంలు మొరాయించడంతో ఓటర్లు గంటలకొద్దీ ఇబ్బంది పడ్డారు. పాలకోడేరు పోలింగ్ కేంద్రాన్ని స్టేట్ అబ్జర్వర్ సందర్శించి పరిశీలించారు శృంగవృక్షం, కోరుకొల్లు, వేంద్ర, పాలకోడేరు, మోగల్లు, విస్సాకోడేరు ప్రజల గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఉండి నియోజకవర్గం వైసిపి అభ్యర్థి పివిఎల్ నరసింహరాజు సందర్శించి ఓటింగ్ సరళని పరిశీలించారు.

గరగపర్రు ఎంపిటిసి సభ్యుడిపై ఫిర్యాదు

గరగపర్రు ఎంపిటిసి సభ్యుడు షేక్ పాపా సాహెబ్(శంకరం) పోలింగ్ కేంద్రాల్లో అనుమతి లేకుండా ప్రవేశించి ఓటర్లను ఇవిఎం దగ్గరకు తీసుకెళ్లి వారి చేత ఓట్లు వేయించటంపై స్థానిక నాయకులు, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. గరగపర్రు ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ బూత్ నెంబర్ 38లో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రశాంతంగా జరగాల్సిన ఎన్నికల్లో బాధ్యతగా వ్యవహరించాల్సిన ఎంపిటిసి సభ్యుడు ఇలా అనుమతి లేకుండా పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లి ఓటర్లను ప్రభావితం చేయడంపై స్థానిక నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు.

జనసేన, వైసిపి శ్రేణుల మధ్య వాగ్వివాదం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సుబ్బారావు పేట వెంకటరత్నం ఆసుపత్రి వద్ద గల 97వ పోలింగ్ కేంద్రం వద్ద వైసిపి, టిడిపి నాయకులు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, కూటమి ఉమ్మడి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ మధ్య మాటల యుద్ధం, తోపులాటలు జరిగాయి. 97, 98 పోలింగ్ బూత్‌లలో జనసేనకు అనుకూలంగా ఓట్లు వేయిస్తున్నారనే ఆరోపణలతో 97వ పోలింగ్ బూత్ వద్దకు కొట్టు సత్యనారాయణ చేరుకున్నారు. విషయం తెలుసుకున్న బొలిశెట్టి శ్రీనివాస్ 97వ పోలింగ్ బూత్ వద్దకు చేరుకోవడంతో వైసిపి, ఉమ్మడి పార్టీ నేతలు ఒకరిపై ఒకరు దూషణలు చేసుకొంటూ బాహాబాహీకి దిగడంతో పోలీసులు రంగంలోకి దిగి ఇరువర్గాలను పోలింగ్ కేంద్రాల బయటకు పంపించేశారు.

పెంటపాడు మండలం అలంపురం గ్రామంలో..

తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గం పెంటపాడు మండలం అలంపురం గ్రామం లో పోలింగ్ సందర్భంగా ఉద్రిక్తత చోటు చేసుకుంది. వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి, డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ పోలింగ్ పరిశీలించేందుకు అలంపురం గ్రామంలోని 165 నెంబర్ పోలింగ్ బూత్‌ను సందర్శించారు. లోపలికి వెళ్లి బయటకు వస్తుండగా జనసేన కార్యకర్తలు, వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి కుమారుడు కొట్టు విశాల్ మధ్య వాగ్వాదం జరిగి తోపులాట జరగడంతో రెండు వైపుల నుంచి ఉద్రిక్తతకు దారి తీసింది. రెండు వర్గాల శ్రేణులు పెద్ద ఎత్తున మోహరించడంతో చాలాసేపు వారి మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. చివరకు తాడేపల్లిగూడెం డిఎస్‌పి మూర్తి అక్కడకు చేరుకుని గుమికూడిన కార్యకర్తలను లాఠీలతో చెదరగొట్టారు. అనంతరం ఓట్లు వేయడానికి వచ్చిన వారిని డిఎస్‌పి మూర్తి ఒక్కొక్కరిని పరిశీలించి పోలింగ్ కేంద్రానికి పంపించడంతో పరిస్థితి సద్దుమనిగింది.

జనసేన, వైసిపిల ఘర్షణను అదుపుచేస్తున్న పోలీసులు

పోటెత్తిన ఓటర్లు

ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురంలో ఓటర్లు పోటెత్తారని ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్ అన్నారు. నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులకు ఓట్లు వేయడానికి సోమవారం ఉదయం నుంచి ఓటర్లు అధిక సంఖ్యలో వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో పోలింగ్ కేంద్రాలు ఓటర్లతో బారులు తీరాయి. ఓటర్లకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పోలింగ్ స్టేషన్ వద్ద టెంట్లు, మంచినీరు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సాయంత్రం 5 గంటలు దాటిన తరువాత కూడా అధిక సంఖ్యలో ఓటర్లు బారులు తీరి ఉండటం విశేషం. గతంలో కన్నా పోలింగ్ శాతం ఈసారి పెరిగిందని రిటర్నింగ్ అధికారి, నరసాపురం ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్ పేర్కొన్నారు.

పోలింగ్ బూత్ వద్ద ఇద్దరి మధ్య వివాదం

విడదీయడానికి వెళ్లిన వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం మండలం వెంప గ్రామంలో ఒక పోలింగ్ బూత్ వద్ద రెండు సామాజిక తరగతులకు చెందిన ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదం తలెత్తింది. సోమవారం ఓటు వేసేందుకు పోలింగ్ బూత్ వద్దకు వచ్చిన వ్యక్తులు గొడవపడ్డారు. ఈ నేపథ్యంలో అక్కడే ఉన్న మరో వ్యక్తి వారిని గొడవపడవద్దని వారించి విడదీసే ప్రయత్నం చేసే లోపు మరో వ్యక్తి గొడవపడే వ్యక్తిపై కర్రతో దాడి చేయబోయాడు. దురదృష్టవశాత్తు కర్ర మధ్యవర్తి తలకి తగలడంతో గాయమైంది. దీంతో అక్కడ ఉన్న వారంతా ఇద్దరికీ సర్ది చెప్పి పంపించేశారు. గాయమైన వ్యక్తికి స్థానికంగా చికిత్స అందించారు.

ఓటు కోసం పాట్లు..

మండు టెండలో గంటల తరబడి క్యూలో ప్రజల అవస్థలు

తణుకు: తణుకులో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఓటు వేసేందుకు ఓటర్లు ఉదయమే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం నుంచి ఓటు వేసేందుకు గంటల తరబడి నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉండటంతో కాస్త తగ్గినా తిరిగి సాయంత్రం నాలుగు గంటల నుంచి ఊపందుకున్నారు. ఓటర్లు తమ ఓటు వేసే విధంగా అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలింగ్ బూత్ వద్ద బిఎల్‌ఒలు కుర్చీలు ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా స్వేచ్ఛగా ఓటు వినియోగించే విధంగా ఏర్పాటు చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్లు, మెడికల్ కిట్లు ఓటర్లకు అందుబాటులో ఉంచారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. బెంగళూరు, హైదరాబాద్ దూర ప్రాంతాల నుంచి కూడా వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తణుకు నియోజకవర్గంలో 233 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

తణుకు:ఓటు వేయడానికి క్యూలో నుంచున్న జనం

ఇరగవరం: ఇరగవరం మండలంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు మండల ఉప ఎన్నికల అధికారి తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు ఉదయం 7 గంటలకు మొదలవగా, అక్కడక్కడా ఇవిఎంలు కొంత మొరాయించడంతో పోలింగ్ ప్రక్రియ నిర్వహణలో కొంత ఆలస్యమైనా ప్రశాంతంగా జరిగిందని, సాయంత్రం 7 గంటల వరకూ 82 శాతం పోలింగ్ నమోదైనట్లు ఆయన తెలిపారు.

తణుకురూరల్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంది. సోమవారం ఉదయం పోలింగ్ మందకొడిగా సాగింది. తణుకు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,34,575 ఉండగా అందులో పురుషులు 11,4435 మంది, మహిళలు 12,0135 మంది, ఇతరులు ఐదుగురు ఉన్నారు. ఉదయం 9 గంటలకు కేవలం 8.29 శాతం ఓటింగ్ నమోదు కాగా 11 గంటలకు 20.05 శాతానికి, ఒంటి గంటకు 37.29 శాతం, 3 గంటలకు 52.56 శాతం, 5 గంటల సమయానికి 65.65 శాతం, పోలింగ్ నమోదైంది. పోలైన మొత్తం ఓట్లు 1,54,003 ఉండగా అందులో పురుషులు 74,250, మహిళలు 79,750 మంది ఓట్లు పోలయ్యాయి.

తణుకు మండలం మండపాక గ్రామంలో బూత్ నెం.93లో ఉదయం 7 గంటలకు పోలింగ్ మొదలైంది. ఇవిఎంలు మొరాయించడంతో సాయంత్రం 4 గంటల వరకు 50 శాతం కూడా ఓట్లు పోలవ్వలేదు. ఎలక్షన్ సిబ్బందిని ఓటర్లు ప్రశ్నించిన పరిస్థితి ఏర్పడింది.

ఇరగవరం మండలం పేకేరు 204 పోలింగ్ బూత్‌లో కూడా ఈవిఎంలు మొదట్లో మొరాయించాయి. తణుకు మండలం తేతలి గ్రామంలో ఉదయం టిడిపి, వైసిపి నాయకులు, కార్యకర్తలు ఇరు పార్టీల నినాదాలతో ఒరెత్తించారు. సాయంత్రం పోలింగ్ బూత్ వద్ద వైసిపి, కూటమి వర్గాలు మధ్య కొంత ఘర్షణ వాతావరణం ఏర్పడింది. పోలీసుల జోక్యంతో ఇరువురిని వారించారు.

పోలింగ్‌ను బహిష్కరించిన గిరిజనులు

ప్రత్యేక పంచాయతీలు ఏర్పాటు చేయాలని డిమాండ్

తహశీల్దార్, విఆర్ఒ చర్చలు

వినతిపత్రం అందించిన అనంతరం ఓట్లు వేసిన గిరిజనులు



గిరిజనులతో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

తమ గిరిజన గ్రామాలకు ప్రత్యేక పంచాయతీలు ఏర్పాటు చేసి ఐటిడిఎలో కలపాలని కొయ్యలగూడెం మండలం వంక బొత్తప్పగూడెం, మర్రిగూడెం, తంగేళ్లగూడెం, బిల్లిమిల్లి, కిచప్పగూడెం గ్రామాల ప్రజలు సోమవారం ఓటు వేయడానికి నిరాకరించారు. మండలంలో సరిపల్లి గ్రామపంచాయతీ పరిధి మర్రిగూడెం, వంకబొత్తగూడెం గ్రామంలో నివసిస్తున్న గిరిజనుల్లో 358 మంది ఓటర్లు ఉండగా సోమవారం పోలింగ్ నిర్వహిస్తున్న వంక బొత్తప్పగూడెంలో ఓటు వేయడానికి గ్రామస్తులు వెళ్లకుండా నిరాకరించారు. తమ గ్రామాలకు ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేసి ఐటిడి పరిధిలో చేర్చాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న కొయ్యలగూడెం తహశీల్దార్ వారి వద్దకు వెళ్లి గిరిజనులంతా కలిసి అధికారులకు వినతిపత్రం అందించి ఓటు హక్కు వినియోగించుకోవాలని ఉదయం 9:30 సమయంలో గ్రామానికి చెందిన ఒకరితో ఓటు వేయించి వెనుతిరిగి వెళ్లిపోయారు. దీంతో గిరిజనులు తహశీల్దార్ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. స్థానిక విఆర్ఒ అడపా రాంబాబు గిరిజనులతో మాట్లాడి వారిని ఒప్పించారు. గిరిజనులు రాసుకున్న వినతిపత్రాన్ని విఆర్ఒ రాంబాబుకు అందించిన అనంతరం గిరిజనులు 10:30 గంటలకు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

రోడ్డు వేస్తేనే ఓట్లు వేస్తాం

దేశవరం గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి - చింతలపూడి

రోడ్డు వేస్తేనే ఓటు వేస్తామని చింతలపూడి మండలంలోని దేశవరం గ్రామస్తులు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా రోడ్డు లేదని తమ సమస్యలను అధికారులకు, నాయకులకు చెప్పినా ఎవరు కనీసం పట్టించుకోవడంలేదని వాపోయారు. తమ గ్రామానికి అడ్డంగా కంచె వేసి తమ గ్రామాభివృద్ధి పట్టించుకోని నాయకులకు తాము ఓటు వేసిన వేయకపోయినా ఒకటేనని ఓటేయడానికి నిరాకరించారు. ఎన్నో ఏళ్లుగా తాము నడవడానికి దారి లేదని మొరపెట్టుకున్నా, అర్జీలు పెట్టుకున్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సెక్రటరీ తహశీల్దార్ వారి వద్దకు వెళ్లి రోడ్డు వేస్తామని, సమస్యను పరిష్కరిస్తామని చెప్పినా వారు ఓటు వేయడానికి నిరాకరించారు. కలెక్టర్ దృష్టిలో పెట్టామని, రోడ్డు వేసే బాధ్యత తీసుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఓటు వేయడానికి బయలుదేరి వెళ్లారు. కలెక్టర్ పట్టించుకుని తమ గ్రామానికి రోడ్డు వేయాలని కోరారు.

సౌదీ నుంచి వస్తే ఓటు లేదు..!

ప్రజాశక్తి - నరసాపురం

శ్రీరామ్

సౌదీ దేశం నుంచి ఓటేసేందుకు వచ్చిన వ్యక్తికి నిరాశ ఎదురైంది. పట్టణంలోని 25వ పోలింగ్ బూత్‌లో చినముత్తేవి బాలాజీ శ్రీరామ్‌కు ఓటు ఉండేది. బాలాజీ శ్రీరామ్ వృత్తి రీత్యా సౌదీ దేశంలో పని చేస్తున్నాడు. రాష్ట్రంలో సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు గత నెల 16వ తేదీన ఇండియా వచ్చాడు. తన స్లిప్ రాకపోవడంతో ఓటు వేద్దామని పోలింగ్ బూత్‌కి వచ్చినప్పుడు బిఎల్‌ఒను అడగ్గా ఆమె మీ ఓటు లేదని తొలగించారని చెప్పడంతో శ్రీరామ్ షాక్ అయ్యారు. ఓటు వేద్దామని వీసాకు ఇంకా సంవత్సరం ఉన్నప్పటికీ రూ.50 వేలు టిక్కెట్టు తీసుకొని వచ్చానని, తీరా ఇక్కడ ఓటు లేదంటే బాధ వేసిందని చెప్పారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్‌పి

పోలింగ్ కేంద్రాల్లో ఎస్‌పి తనిఖీలు

సిబ్బందికి పలు సూచనలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్‌పి అజిత వేజెండ్ల సిబ్బందికి సూచించారు. సోమవారం ఎన్నికల నేపథ్యంలో భీమవరం నియోజకవర్గంలోని సమస్మాత్మక పోలింగ్ బూత్ ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. చినఅమిరం, గునుపూడి శ్రీఉమాసోమేశ్వర మున్సిపల్ స్కూల్‌లో పోలింగ్ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రజలు నిర్భయంగా ఓటు వేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఆమెతో పాటు భీమవరం టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాస్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు వేయటానికి వచ్చి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఓటు హక్కును వినియోగించడానికి వచ్చిన ఒక వ్యక్తి గుండెపోటుతో మృతి చెందిన సంఘటన మండలంలోని యనమదుర్రు గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... యనమదుర్రు గ్రామ పంచాయతీ డేగాపురం ప్రాంతానికి చెందిన పిల్లి సువర్ణరాజు (70)కు గతంలోనే గుండెపోటు రావడంతో చికిత్స తీసుకున్నారు. ఈ క్రమంలో సోమవారం ఓటు వేసేందుకు క్యూ లైన్‌లో నిల్చున్న సువర్ణరాజు ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అక్కడున్న ఎన్నికల సిబ్బంది, స్థానికులు ఆయనను హుటాహుటిన ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే రాజు మృతి చెందినట్లు నిర్ధారించారు.

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌పి, కలెక్టర్

సాధారణ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ అనంతరం ఇవిఎంలు స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపరిచేందుకు రిసెప్షన్ సెంటర్లను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ సోమవారం పరిశీలించారు. స్థానిక డాక్టర్ బివి.రాజు కళాశాలలో ఆచంట, తణుకు, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాలకు సంబంధించి స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలు, రిసెప్షన్ సెంటర్లను ఎస్‌పి అజిత వేజెండ్లతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ పక్రియ అనంతరం నాలుగు నియోజకవర్గాల నుంచి ఇవిఎంలు, తదితర మెటీరియల్ స్వీకరించి, స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రత పరిచేందుకు రిసెప్షన్ సెంటర్లను పరిశీలించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రిసెప్షన్ సెంటర్లకు వచ్చే అధికారులకు, సిబ్బందికి వండుతున్న ఆహార పదార్థాలను కలెక్టరు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ ముగిసిన అనంతరం నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి వారికి కేటాయించిన స్ట్రాంగ్ రూమ్ దగ్గర ఉన్న రిసెప్షన్ సెంటర్లుకు అప్పజెప్పి ఆర్‌ఒ సూచనల మేరకు భద్రపరచాలన్నారు. నాలుగు నియోజకవర్గాల నుంచి వచ్చే అధికారులు, సిబ్బంది, కారు డ్రైవర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా భోజన సదుపాయాలు కల్పించినట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలకు సంబంధించిన ఇవిఎంలను ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో భద్రపరచనున్నట్లు తెలిపారు. భీమవరం పట్టణ పరిధిలోని 99,137 పోలింగ్ స్టేషన్లను జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ ఎస్‌పి అజిత వేజెండ్లతో కలిసి పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. వారితో పాటు ఎన్నికల అధికారులు, పోలీసు అధికారులు, సర్వే అధికారుల బృందం ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి

ఓటుకు నోటు ఇవ్వలేదని నిరసన



నిరసన తెలుపుతున్న కొండ్రుప్రోలులో కాలనీవాసులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

అధికార పార్టీ నాయకులు ఓటుకు నోటు ఇస్తామని చెప్పి ఇవ్వలేదని మండలంలోని కొండ్రుప్రోలు గ్రామంలో కాలనీ వాసులకు సోమవారం నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండ్రుప్రోలు కాలనీలోని మెట్ట ప్రాంతంలో సుమారు 200 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఆదివారం రాత్రి వారిలో 15 మందికి ఓటుకు నోటు ఇచ్చి మిగిలిన వారికి మళ్లీ ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. దీంతో తామంతా ఆదివారం రాత్రి నుంచి డబ్బుల కోసం వేచి చూశామని, ఎంతకీ ఇవ్వకపోవడంతో సోమవారం మధ్యాహ్నం నుంచి నిరసన చేపట్టామని తెలిపారు.

పోణంగిలో ఉద్రిక్తత

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పోణంగి గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ వద్ద ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. వైసిపి, టిడిపి కార్యకర్తల మధ్య ఘర్షణలో వేమూరి నాగరాజు(26)కి మెడ వద్ద గాయమైంది. టిడిపి తరపున వీల్‌చైర్‌పై ఓటర్లను పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్తున్నాడనే నెపంతో గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో పీక కోశారు. వంగాయగూడెంకి చెందినవారిగా బాధితుడు అక్క పలిపే అలివేలు అనుమానిస్తున్నాడు. బాధితుడిని ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు.

పోలింగ్ కేంద్రాలు... అసౌకర్యాల నిలయాలు

సౌకర్యాల కల్పనలో అధికారులు విఫలం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భీమవరం నియోజకవర్గంలో 236 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. భీమవరం పట్టణంలో పోలింగ్ కేంద్రాల వద్ద నిర్వహణ మరింత దారుణంగా ఉంది. ఓటర్లకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమయ్యారని ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం తాగునీరు కూడా ఏర్పాటు చేయలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని పోలింగ్ కేంద్రాలు ఇరుకుగా ఉండటంలో ఓటర్లు పలు ఇబ్బందులకు గురయ్యారు. కొంతమంది ఓటర్లు అస్వస్థతకు గురయ్యారు. జిల్లా కేంద్రంలోని ఎన్నికల నిర్వహణ ఇలా ఉంటే ఇంకా ఇతర నియోజకవర్గంలో, మండల కేంద్రంలో పోలింగ్ బూత్ వద్ద ఏర్పాట్లు ఎలా చేసుంటారని సర్వత్ర ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడేవారిని పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మహిళలు పెద్ద ఆపరేషన్ వంటివి చేయించుకుని వచ్చినవారిని ఎండలోనే గంటల తరబడి నిలబెట్టిన పరిస్థితి నెలకొంది. ఏర్పాట్లపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ఓటర్లు కోరుతున్నారు.

ఓటరును చేతులపై మోసుకొస్తున్న వ్యక్తి